KSR02B130 c

ఓకే
బంగారం



ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
జులై 24, 2016

స్నేహ

ENTERED

పెళ్లికీ ఓ లెక్కుంది

విజయశ్రీ

లావణ్య త్రిపాఠి

కేథరిన్ ట్రిసా

అదా శర్మ

వారసత్వ నటుల క్రేజీకు కాస్త బ్రేకులు పడటం, నాని, శర్వానంద్, సందీప్ కిషన్, నాగ శౌర్య లాంటి హీరోలు సక్సెస్ రేసులో ముందుండటంతో దర్శకులు ఫార్ములా సినిమాల నుంచి బయట పడుతున్నారు. ఇది హీరోయిన్లకు కలిసొస్తోంది. లేడీ ఓరియెంటెడ్ సినిమాల్లా కాకపోయినా హీరోయిన్ పాత్రకు ప్రాధాన్యమున్న కథలు ఎక్కువవుతున్నాయి. కేవలం గ్లామర్ డాల్‌గానే చూస్తూ ఏదో పది సీన్‌లు, నాలుగు పాటలు అన్నట్టుగా కాకుండా వారి పాత్ర బరువు పెంచుతున్నారు. ఇదో మంచి పరిణామం. ఇటీవలే భారీ హిట్ కొట్టిన 'అఆ'లో సమంత నటన ఓ హైలెట్. ముఖ్యమైన పాత్ర కూడా. అంతకు ముందే 'గరం'లో అదా శర్మ ఈ కొత్త వరవడితో మంచి పాత్రను చేసింది. సినిమాలో ఎక్కువ భాగం బుర్ఖాలోనే కనిపించే పాత్రలో ఆమె కేవలం కళ్లతోనే భావోద్వేగాల్ని పలికించి నటనంటే ఏంటో చాటింది. ఆ తర్వాత 'క్షణం'లో ఆమెకు దక్కిన పాత్ర నటనకు చాలా అవకాశాన్నిచ్చింది. 'సరైనోడు'లో ఎమ్ఎల్ఏగా క్యాథరీన్ ట్రిసా నటన శభాష్ అనిపించేలా ఉంటే మళయాళ భామ నివేద థామస్ 'జెంటిల్‌మేన్'లో కీలక పాత్రకు ప్రాణం పోసింది. తమన్నా 'కళాశాల' తర్వాత మళ్లీ డీ-గ్లామ్ పాత్రలో 'అభినేత్రి'లో మెరిసింది. లావణ్య త్రిపాఠి రాబోయే చిత్రంలో సైకియాట్రిస్ట్‌గా కనపడనుంది. ఈ మార్పు వారి పారితోషికం విషయంలో కూడా ముఖ్యపాత్ర వహిస్తోంది. సినిమా సక్సెస్‌కు హీరోతో సమానంగా కష్టపడుతోన్న హీరోయిన్‌లకు గుర్తింపు పెరుగుతోంది. హీరోయిన్లపై ఓ రకంగా ప్రేక్షకుడి మైండ్‌సెట్ కూడా మారుతోంది.

నివేద థామస్

సమంత

తమన్నా

ENTERED
KSR02B130

స్టార్

ok బంగారం

దుల్కర్ సల్మాన్ 1896 జూలై 28న కొచ్చీలో జన్మించాడు. ఈ హీరో మలయాళ ప్రముఖ నటుడు మమ్ముట్టి తనయుడు. పుట్టింది కేరళలో అయినా విద్యనభ్యసించింది మాత్రం తమిళనాడులోనే. అతని పాఠశాల చదువంతా చెన్నైలోనే సాగింది. సినిమాల్లో తన నటనతో మెప్పించే ఈ హీరో మంచి బిజినెస్‌మేన్. ఎందుకంటే అతను అమెరికాలో పర్‌డ్యూ యూనివర్సిటీలో బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో బ్యాచ్‌లర్ డిగ్రీ చేశాడు. దుల్కర్ చదివిన చదువు నిజ జీవితంలో ఎలా ఉపయోగపడుతుందో పరీక్షించాలనుకున్నాడు. ఈ నేపథ్యంలో అమెరికా, దుబాయ్‌ల్లో ఐటీ సంబంధమైన వ్యాపారం కూడా చేశాడు. అందులో రాణించాక అప్పుడు నటనా రంగంలోకి రావాలని భావించాడు.

- 2009లో ముంబైలో మాస్టర్ బర్రీ జాన్ నటనా పాఠశాలలో మూడు నెలల పాటు శిక్షణ పొందిన తర్వాత నటుడిగా రంగప్రవేశం చేశాడు.
- నటనలో ట్రైనింగ్ పొందినా సినిమాల్లో నటించడానికి మూడేళ్లు పట్టింది. 2011లో మొదటిసారిగా ఓ సినిమాలో చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. హరిలాల్ పాత్రలో గ్యాంగ్‌స్టర్‌గా అదరగొట్టేశాడు. ఓ సీనియర్ యాక్టర్ ప్రేక్షకులను ఏవిధంగా మెప్పించగలడో అలా మరిపించాడు దుల్కర్. అందుకే ఫిల్మ్‌ఫేర్ అవార్డుల్లో బెస్ట్ మేల్ డెబ్యూగా అవార్డు వరించింది.
- ఆ తర్వాత ఏడాది అన్వర్ రషీద్ దర్శకత్వంలో చేసిన 'ఉస్తాద్ హోటల్' కూడా బాక్సాఫీస్ వద్ద రికార్డు నమోదు చేసింది. నిత్యా మీనన్‌తో చేసిన ఈ సినిమాకు నేషనల్ అవార్డు లభించింది. ఇందులో కూడా దుల్కర్ అద్భుతమైన పెర్ఫార్మెన్స్ ఇచ్చాడు. రెండో చిత్రానికే ఫిల్మ్‌ఫేర్ అవార్డుల్లో బెస్ట్ యాక్టర్‌గా కూడా తన పేరు నామినేట్ అయింది. ఆయన చేసిన మూడో సినిమా 'తీవ్రమ్' మాత్రం నిరాశ పరిచింది. తర్వాత ఏడాది కామెడీ తరహాను ఎంపిక చేసుకున్నాడు.
- ఏబీసీడీ(అమెరికన్ బోర్న్ కన్‌ఫ్యూజ్డ్ దేశీ) చిత్రంలో నటించి మళ్లీ మరోసారి బాక్సాఫీస్ వద్ద తన సత్తాను చాటుకున్నాడు ఈ హీరో.
- అదే ఏడాది ఐదుగురు దర్శకులు కలసి సుందరికల్ (ఐదుగురు అందమైన మహిళలు) అనే మల్టీస్టారర్ సినిమా తీశారు. ఇందులో తొమ్మిది మంది ప్రధాన నటీనటులు చేయడం గమనార్హం. భారీ తారాగణంతో తీసిన ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించారు.
- కొత్త ప్రయోగాలతో చేసిన తర్వాతి చిత్రాలు మాత్రం తీవ్ర నిరాశను మిగిల్చాయి. మొత్తం ఏడాదిలో ఏ సినిమా చేసినా చేదు అనుభవాలే ఎదురయ్యాయి. మళ్లీ 2014లో దుల్కర్‌కు మంచి రోజులు వచ్చాయి. 'బెంగుళూర్ డేస్' చిత్రం ఆయన కెరీర్‌ను మలుపు తిప్పింది. మలయాళంలో అత్యధికంగా కాసులు కురిపించిన చిత్రాల్లో ఇదొకటిగా నిలవడం విశేషం. తర్వాత తీసిన సినిమా కూడా విజయ స్ఫూర్తిని తగ్గనివ్వలేదు. రంజిత్ దర్శకత్వంలో చేసిన 'ఎన్‌జాన్' చిత్రంలో ఆయన పెర్ఫార్మెన్స్‌కు మాలీవుడ్ మొత్తం దుల్కర్‌ను ప్రశంసలతో ముంచెత్తింది.
- నిత్యా మీనన్, దుల్కర్ జంటగా చేసిన హండ్రెడ్ డేస్ ఆఫ్ లవ్, మణి రత్నం దర్శకత్వంలో వచ్చిన ఓకే బంగారం(ఓ కాదల్ కన్మాని(తమిళ్) మంచి విజయాలు నమోదు చేసుకున్నాయి. ఓకే బంగారం చిత్రంలో ఆయన చేసిన పాత్రకు ఓ ఇంగ్లీష్ పత్రిక మరో మాధవన్ అని ప్రశంసించడం విశేషం.
- ఈ ఏడాది మలయాళంలో కలి, ముధుగావ్, కమ్మటిపాదమ్ వంటి చిత్రాల్లో చేశాడు. అన్న మారియ కలిప్పిలాను చిత్రంలో అతిథి పాత్రలో మెరవబోతున్నాడు. మరో మలయాళ చిత్రంలో హీరోగా చేస్తున్నాడు. ఇవి కాకుండా నాలుగు ప్రాజెక్టులు ప్రస్తుతం చర్చల్లో ఉన్నాయి.

వరించిన అవార్డులు :

- 2012లో 'సెకండ్ షో' చిత్రంలో పాత్రకు గానూ సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డు, వనితా ఫిల్మ్ అవార్డుల్లో ఉత్తమ నటుడుగా పురస్కారాలు వరించాయి. 'ఉస్తాద్ హోటల్' సినిమాలో ఆయన పెర్ఫార్మెన్స్‌కు అవార్డు దక్కింది.
- 2014లో ఎన్‌జాన్, బెంగుళూర్ డేస్, వాయై మూడి పేసవుమ్ చిత్రాల్లో నటనకు గానూ దుల్కర్ బెస్ట్ యాక్టర్, బెస్ట్ పెయిర్ పురస్కారాలు అందుకున్నాడు.
- 2015లో చార్లీ చిత్రంలో నటనకు కేరళ రాష్ట్రం అందించే ఫిల్మ్ అవార్డు, నార్త్ అమెరికన్ ఫిల్మ్‌ఫేర్ అవార్డుల్లో ఉత్తమ నటుడు అవార్డులు తీసుకున్నారు.

తండ్రి చేసే వృత్తిని కాకుండా మరో రంగంలో రాణించాలని భావించడం వినూత్నమే. అదే రంగుల ప్రపంచమైతే తప్పకుండా ఆ రంగాన్ని ఆహ్వానిస్తారు. ఎందుకంటే అక్కడ వారికి లభించే ఆదరణ అంతా ఇంతా కాదు కదా. అందుకే మొదట్లో తండ్రి చేసే పనే తానూ చేయడమేమిటని భావించినా ఇప్పుడు ఆ రంగంలో తండ్రికి తగ్గ తనయుడిలా రాణిస్తున్నాడు. అతనే దుల్కర్ సల్మాన్...మలయాళ స్టార్ మమ్ముట్టి తనయుడు. ప్రతి సినిమాలోనూ తన నటనతో మెప్పించి ఓకే బంగారం అనిపించుకుంటున్నాడు.



- కొప్పుసెట్టి దేవరాజు

ఇండెక్స్

ప్రత్యేకం..................3

కలంతో చెట్టు

వినూత్నం..............4

బేకింగ్ అకాడెమీ

కార్టూన్ పంచ్.........5

వింత లోకం...........10

రాజకుమారుడి విందు

కొత్త పుస్తకాలు........11

స్త్రీ జీవితానికి నిలువుటద్దం

కవిత్వమ్...............14

ఓ ఇల్లు

పెళ్లికీ ఓ లెక్కుంది

అట్టమీది కథ...6

నా కళ్లతో - 12

ఒంటరిగా...
33 దేశాలు...

మార్గదర్శి...................15

గోదారి తీరంలో సీతమ్మ చెట్టు

తెలుసా 16

ఎండ్ హ్యూమన్ ట్రాఫికింగ్

కథ.......................18

కబేళా

రుచి......................21

మరాఠీ బకర్‌వాడి

బాల నేస్తాలు.............23

షూబిల్

పద వికాసం.....
....24

అమ్మే ఆధారం

మనిషి,ప్రకృతి బావుండాలంటే ఆడపిల్లలు బావుండాలని, భూగర్భ వనరుల్ని పొదుపుగా వాడుకోవడంతో పాటు పర్యావరణ పరిశుభ్రతకీ మనిషి ప్రాధాన్యమివ్వాలని తెలియజేసిన అట్టమీది కథ చదివించింది. అల్లికల వీధుల్లో, నమీబియా డెడ్‌వెలి ఎడారి ప్రాంతపు అందాలు, కార్టూన్ పంచ్, నవ్వుల్ పువ్వుల్, జేబు కథ బాగున్నాయి. జియా జాన్, రగులుతోన్న దీవి, సినీ పిచ్‌పై క్రికెటర్లు ఆకట్టుకున్నాయి. అచ్చంపట్టి గ్రామంలో మార్పుతెచ్చేలా వృద్ధ జంట అంబళం, అంగమ్మాళ్ చేస్తున్న కృషి అభినందనీయం.

- హర్షవర్థన్, విజయనగరం

వందేళ్ల వర్సిటీ

మహిళల కోసం ప్రస్తుతం ఎన్నో ప్రత్యేక మైన స్కూళ్లు, కళాశాలలున్నా 20వ శతాబ్దంలో వితంతువులకోసం ప్రత్యేకంగా విశ్వవిద్యాలయం స్థాపించడం అభినందనీయం. 100 ఏళ్ల పూర్తిచేసుకున్నా వృత్తి విద్యా కోర్సులతో పాటు రీసెర్చి కోసం మంచి లైబ్రరీ కలిగుండడం మంచి విషయం. భూభాగంపై ఆడపిల్లభారం కాదని చెప్పడం అట్టమీద కథ ద్వారా



అందించిన తీరు బావుంది. ఈ వారం జోకులు, కార్టూన్ పంచ్ బాగున్నాయి.తెలుసా అంటూ ప్రతి వారం ఇచ్చే సమాచారం బాగుంది. మరుగుదొడ్లు కట్టుకోవడం బాధ్యతగా భావించేలా అచ్చంపట్టిలో వృద్ధ దంపతులు ప్రచారం చేయడం హర్షణీయం. 12 నెలలు..12 దేశాలు..12 సవాళ్లతో సచిన్‌బండారి యాత్రల్లో వింత అనుభూతులు, రగులుతోన్న దీవి, కాలప్రవాహంలో, పక్షులు మబ్బులు నా గురువులు కవిత ఆద్యంతం చదివించాయి.

- స్వప్నిక, ఒంగోలు

మురికివాడల్లో మాణిక్యాలు

స్నేహ సంచికలో వచ్చిన జైలుగోడలపై ఆశాకిరణాలు, మురికివాడల్లో మాణిక్యాలు, కోకోమాట, ఆటలపాటల హరివిల్లు ఆకట్టుకున్నాయి.చీమలు దూరని, సూర్యకిరణాలు తొంగి చూడడానికి వీలు కానటువంటి ఎత్తైన గోడల మధ్య జీవిత ఖైదీల దుర్భర జీవితాల్లో మార్పు తేవడానికి వారి మనోవికాసానికి దోహదపడే మార్పులు చేయడానికి జైలు సిబ్బంది పూనుకోవడం హర్షనీయమైన విషయం. మురికివాడల్లోని వారి జీవితాలు చాలా బాధాకరంగా ఉంటాయి. వారిలో ఉన్న ప్రతిభాపాటవాలు పట్టుదలతో ఉన్నత శిఖరాలను చేరుకోడానికి యువత చేస్తున్న అద్భుతాలను, సాహసోపేత మైన చర్యలను పాఠకులకు తెలియజేయడం హర్షణీయమైన విషయం. కోతులు కూడా భాషని ఇట్టే పసికట్టేయగలగడం అద్భుతం. కోకో సైగలు చేష్టలు వింతగొలిపాయి.

- కైప నాగరాజు, అనంతపురం

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

ప్రత్యేకం



కాగితంతో కలాలు.. వినే ఉంటాం రాసే ఉంటాం. ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గిస్తాయివి. పర్యావరణానికి మేలు చేసే వీటిని ఇంకేం చేస్తే మరింత ప్రయోజనకరంగా ఉంటుంది? ఆలోచిస్తున్నారా? కేరళకు చెందిన లక్ష్మీ మీనన్ అలా ఆలోచించే ఓ కొత్త ప్రయోగం చేసింది. అదే కలాల్లో వృక్షాలు. అవును నిజమే.. కాగితపు కలాల్లో విత్తనాలను వేసి వాడి పారేసిన తర్వాత అవి చెట్లలా మొలకెత్తేలా వినూత్నమైన ఆలోచన చేసింది లక్ష్మీ మీనన్.

కలంతో చెట్లు



చాలా మంది బాల్ పాయింట్ పెన్నుల్ని వాడతారు. వాటిలో రీఫిల్ వేసి మళ్లీ మళ్లీ వాడుకోవచ్చని అనుకుంటారు. కానీ అది అనుకోవడం వరకే ఆగిపోతుంది. పెన్ను రాయడం ఆగిపోగానే చెత్త బుట్టలోకి విసిరేస్తారు. ఇక కనిపించకుండా పోయిన వాటి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిందేముంది. ఇప్పటి కలాలన్ని ప్లాస్టిక్‌వే. అవన్నీ ఎక్కడ చేరుతున్నాయి. మట్టిలో కలవడానికి ఎన్నేళ్లు పడుతుంది. ఈ అంశమే లక్ష్మీ మీనన్‌ను ఆలోచనలో పడేసింది. 'లివింగ్ ప్యూర్' పేరిట పర్యావరణానికి హానీ చేయకుండా ఎలా స్వచ్ఛంగా జీవించాలో నేర్పుతున్న ఆమె బృందం చిన్నదనుకున్న ఈ అంశాన్నే పెద్దగా పట్టించుకుంది. లక్ష్మీ ఓ సృజనకారిణి. అదే ఆమెకు ఓ చక్కటి పరిష్కారం చూపింది. చెత్త కాగితాల గుజ్జుతో దృఢమైన కలాల్ని రూపొందించడం తెలుసుకుంది. ప్రింటింగ్ ప్రెస్సులో వృథా అయిన కాగితాల్ని, దిన పత్రికల ప్రతుల్ని, చెత్త కాగితాల్ని వినియోగించుకుంటే కొత్త కాగితం కొనాల్సిన అవసరం ఉండదు. మరో చెట్టు నేల కూలదు. కాగితాన్ని పెన్నులా చుట్ట చుట్టే ఓ యంత్రాన్ని కూడా ఆమె స్వయంగా రూపొందించింది. దానిపై పేటెంట్ కూడా పొందింది. దాని చివరన ఓ విత్తు ఉండేలా డిజైన్ చేసింది. అగస్త్య వృక్షం విత్తనాల్నే ఎంచుకుంది. దీన్నే హమ్మింగ్ బర్డ్ చెట్టుగా కూడా పిలుస్తారు. అగిసె చెట్లంటే తెలుస్తుంది. ఈ చెట్టు పూలు, ఫలాలు, కాండం, బెరడు చివరకు ఆకులు కూడా అనేక రకాలుగా ఉపయోగిస్తారు. చెట్టంతా ఎర్రటి పూలను వికసించే అగిసె చెట్లు సిద్ధ, ఆయుర్వేద వైద్యాలకే కాక వంటింటికి కూడా బాగా పరిచయమెక్కువ. కేరళ, కర్నాటక మన రాయల సీమల్లోను కొబ్బరితో కలిపి వంటకాలు చేస్తారు. థాయ్‌ల్యాండ్, శ్రీలంక, మలేషియా వారి ప్రియమైన రుచుల్లో దీని వంటకాలకు చోటుంది. ఈ వృక్షాలు చాలా వేగంగా పెరుగుతాయి. అందుకే లక్ష్మి వాటి విత్తుల్నే కలాల్లో ఉంచుతోంది. పెన్ను పోయినా, వాడి పారేసినా నేలలోకి చేరితే కాగితం త్వరగా మట్టిలో కలిసిపోతుంది. ఈలోగా విత్తు కాస్త లోతులోకి వెళుతుంది. వర్షాకాలంలో గానీ లేదా నీటి లభ్యత వల్ల గానీ అవి మొలకెత్తుతాయి. ముందే ఆ పెన్నులు గురించి తెలిసిన వారైతే కుండీల్లో వాటిని నాటితే సరి. పర్యావరణహిత కార్యక్రమంలోకి వాళ్లు ఎంట్రీ అయిపోయినట్టే. అందుకే ఆ కలాలకు 'ఎంట్రీ' అని పేరు కూడా పెట్టింది. వీటి తయారీకి లక్ష్మి ఎంచుకుంది మహిళా గ్రూపుల్నే. మహిళా సాధికారత గురించి కూడా కార్యక్రమాలు



నిర్వహిస్తున్న లక్ష్మి ఈ రకంగా వారికి చేయూతనిస్తోంది. నడుం కింది భాగం పక్షవాతానికి గురైనవారికీ వీటి తయారీ తేలిగ్గా ఉండటాన్ని గమనించి వారిని ప్రోత్సహిస్తోంది. తక్కువ ధరకే దొరికే ప్లాస్టిక్ కలాల మార్కెట్‌లో 12 రూపాయల ఈ పెన్నులి అమ్మకం ఇప్పుడు కష్టమే కావచ్చు. కానీ లక్ష్మి సదుద్దేశం గురించి తెలుసుకున్న కొన్ని సంస్థలు, కళాశాలలు కొనేందుకు ముందుకు వస్తున్నాయి. ప్లాస్టిక్ పెన్నుల కాలుష్యం ప్రభావం గురించి అవగాహన కల్పించేందుకు స్థానిక పాఠశాలల్లో ఆమె ఓ డ్రైవ్ చేపట్టింది. పాడైన పెన్నుల్ని సేకరించి వాటితో ఓ కళాఖండాన్ని రూపొందించాలని, అది ఎంత పెద్ద ఎత్తున ప్లాస్టిక్ పెన్నుల చెత్త పోగవుతుందో తెలిపేలా ఉండాలని అనుకుంటోంది. నిత్యం మన మధ్యే ఉంటూ మన దృష్టి పడని ఓ విషయంలో ఇలా వినూత్నమైన ఆలోచనలతో మార్పు తీసుకురావాలనుకుంటున్న లక్ష్మి మీనన్‌కి అభినందనలు తెలపాల్సిందే.

-జే

బేకింగ్ అకాడెమీ

ఆసక్తి లేకపోయినా అవకాశం వచ్చిందని దిగితే మనస్ఫూర్తిగా పనిచేయలేరు. యాంత్రికంగా పని చేసుకుంటూ వెళ్ళిపోతారు. పట్టుబట్టి తమకు ఆసక్తి ఉన్న రంగంలోనే దిగేవారు అద్భుతాలు సృష్టిస్తారు. ఆ కోవకు చెందిన వాడే వినేష్ జానీ. తనకు ఎంతో ఇష్టమైన 'బేకింగ్' (పాకశాస్త్రం)లోనే కెరీర్ ప్రారంభించాడు. తర్వాత తానే 24 ఏళ్లకే ఏకంగా ఓ అకాడెమీ పెట్టేశాడు.

బేకింగ్ సైన్స్... పేస్ట్రీ ఆర్ట్స్...చదవడానికే కొత్తగా ఉంది కదూ. అదేనండి మనోళ్ళు పిలిచే పాకశాస్త్రంలో వినేష్ జానీ ప్రతిభ మంచి పాకాన పడింది. ఇరవై నాలుగేళ్ల వయసులో బెంగళూరులో వినేష్ జానీ 'లవొన్నె' పేరిట బేకింగ్ అకాడమీ ప్రారంభించాడు. అవిన్ తలైత్, లిజో ఎపీన్ అనే తన ఇద్దరు మిత్రులతో కలిసి కేకులు, పేస్ట్రీల తయారీ విద్యను అందిస్తున్నాడు. 'లవొన్నె' భారత్‌లో మొట్టమొదటి అంతర్జాతీయ బేకింగ్ అకాడెమీ. మొదటి నుంచి హోటల్ మేనేజ్‌మెంట్ పైనే ఆసక్తి ఉన్న వినేష్ ఇంటర్ అయిపోగానే బెంగళూరులోని క్రైస్ట్ కాలేజీలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులో చేరిపోయాడు. మొదటి నుంచి బేకింగ్‌పైనే అమితమైన ఆసక్తి చూపేవాడు. సరిగ్గా అలాంటి ఆలోచనలే ఉన్న తన బ్యాచ్‌మేట్స్ అయిన అవిన్, లిజోలతో కలిసి కొత్తగా ఏం చేద్దామా అని ఆలోచించేవాడు. కోర్సు చివరి దశలో కేకులు, పేస్ట్రీల తయారీలో స్పెషలైజేషన్ చేద్దామని నిర్ణయించుకున్నారు. కానీ అలాంటి అడ్వాన్స్ బేకింగ్ కోర్సులు అందించే సంస్థలేవి భారత్‌లో కనిపించలేదు. ఇలాంటి కోర్సులు చేయాలంటే మలేషియా, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా లాంటి దేశాలకు వెళ్లాల్సిందే. అందుకే ఇలా వరల్డ్ క్లాస్ బేకింగ్ అకాడెమీ పెట్టాలని వారు నిర్ణయించుకున్నారు. అనుభవం కోసం హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తయిన తర్వాత కొన్నాళ్లపాటు ఒబెరాయ్ గ్రూప్, స్టార్‌వుడ్ హోటల్స్ అండ్ రిసార్ట్స్‌లో కొన్నాళ్లు పనిచేశాడు. ఆ తర్వాత మలేషియాలోని 'ఫేవిస్ డి చాకో అకాడమీ ఆఫ్ పేస్ట్రీ ఫైన్ ఆర్ట్స్' నుంచి షుగర్ ఆర్ట్, వెడ్డింగ్ కేక్ డెకరేషన్‌లో డిప్లొమా చేశాడు. అంతకు మించి అంతులేని ఆత్మవిశ్వాసం దరిచేరింది. బెంగళూరులో 'లవొన్నె అకాడెమీ'కి అంకురార్పణ జరిగింది.

కోర్సుల వివరాలు

కొత్తగా కెరీర్ ఎంచుకునేవారికి ఇప్పటికే అనుభవం ఉన్న బేకర్స్‌కి కూడా లవొన్నె అకాడెమీలో కోర్సులు డిజైన్ చేశారు. మొత్తం 480 గంటల ఫుల్‌టైమ్ డిప్లొమోతో పాటు హాబీగా వారాంతాల్లో నేర్చుకునేలా క్లాసులుంటాయి. ప్రొఫెషనల్స్ కాదు... ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ నేర్చుకునేందుకు ఏదో ఒకటి ఉంటుందక్కడ. శిక్షణ ఇవ్వడానికి పేరు పొందిన అంతర్జాతీయ చెఫ్‌లతో ఒప్పందం చేసుకున్నారు. అకాడెమీలో అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు కల్పించారు. శిక్షణ కోసం వచ్చేవారికి ఎంట్రప్రెన్యూరియల్ ట్రైనింగ్ కూడా ఇస్తారు. కోర్సులు పూర్తయిన వారికి ఫైవ్ స్టార్ హోటల్స్‌లో ఉద్యోగాలొస్తున్నాయి. అక్కడే ఇంటర్న్‌షిప్ చేసేవారిలో ఎక్కువమంది సొంత వ్యాపారానికి ఉత్సాహం చూపించేవాళ్లే. శిక్షణ ఇచ్చేందుకు బెల్జియం, ఫ్రాన్స్ నుంచి మెటీరియల్‌ను వినేష్ దిగుమతి చేసుకుంటారు.

అవరోధాలను అధిగమిస్తూ...

అకాడెమీ పెట్టడమనేది అంత తేలిగ్గా జరగలేదు. ఎలాంటి వ్యాపార నేపథ్యం లేకపోవడంతో ఎలా ప్రారంభించాలో తెలియక అనేక ఇక్కట్లు పడ్డాడు. చివరికి అనుమతులు ఎలా తెచ్చుకోవాలో... అగ్రిమెంట్లు ఎలా చేసుకోవాలో కూడా తెలియక తికమకపడ్డాడు. ఈ ఇబ్బందులతోనే తొలిసారి అకాడెమీ ప్రారంభించాల్సిన ముందురోజు ఆపేయాల్సి వచ్చింది. భవన యజమానురాలు లేనిపోని పేచీలు పెట్టి అడ్డుపడటంతో.... ప్రారంభ ముందురోజు భవనాన్ని ఖాళీ చేయాల్సి వచ్చింది. వెనకడుగు వేయకుండా మూడు నాలుగు నెలలు ఆలస్యమైనా మంచి చోటు వెదికి అకాడెమీ ప్రారంభించేశారు.

స్వీట్ ఫ్యూచర్

లండన్‌కు చెందిన కలినరీ ఆర్ట్స్ అకాడెమీ సిటీ అండ్ గిల్డ్స్‌కు ప్రస్తుతం 'లవొన్నె' అనుబంధంగా కొనసాగుతోంది. మౌత్ పబ్లిసిటీ, సోషల్ మీడియా ద్వారా వచ్చే ప్రచారం ద్వారానే లవొన్నెలో విద్యార్థులు చేరుతున్నారు. 2016 ఏడాదిగాను టైమ్స్ ఫుడ్ ప్రైజుల్లో బెస్ట్ కాన్ఫెక్షనరీ విభాగంలో వచ్చిన అవార్డులు వినేష్ బృందానికి కొత్త ఉత్సాహాన్ని ఇస్తున్నాయి. స్థిరమైన ఆలోచనలకు కొంచెం అంకిత భావం, మరికొంత సహనం కలిపి ప్రయత్నిస్తే విజయం కేక్ కోసినంత ఈజీ అవుతుంది.

- అనంతోజ్ మోహన్ కృష్ణ

కార్టూన్ పంచ్





నవ్వుల్ - పువ్వుల్

ఒక పావురం ఒక కారుని ఢీకొట్టి స్పృహ తప్పి పడిపోయింది.

ఆ కార్ ఓనర్ దానికి ట్రీట్‌మెంట్ ఇప్పించి ఇంటికి తీసుకొచ్చి ఒక పంజరంలో పెట్టాడు.

తర్వాత కొంత సేపటికి పావురం స్పృహలోకి వచ్చి చుట్టూ చూసి ఇలా అనుకుంది.

కార్ ఓనర్‌కేమైనా ప్రమాదం జరిగిందా ఏంటి నన్ను జైల్లో పెట్టారు...

కవల స్నానం



ఒక రూంలో ఇద్దరు కవల పిల్లలు కూర్చుని ఉన్నారు. ఒకడేమో ఏడుస్తున్నాడు, ఒకడేమో పడీ పడీ నవ్వుతున్నాడు.

అది చూసి వాళ్ళ నాన్న అడిగాడు

"ఒరేయ్ వాడు ఏడుస్తుంటే, నువ్వెందుకురా నవ్వుతున్నావ్?"

ఇంత చలిలో మమ్మీ నేననుకుని వీడికి రెండోసారి స్నానం చేయించింది అని చెప్పాడు.

తేడా

"ఏకలవ్యుడికి మీకు తేడా ఏంట్రా." అని అడిగాడు మాస్టారు

"మేము వేలు పోసి చదువుకుంటుంటే, ఏకలవ్యుడు వేలుకోసి చదువుకున్నాడు సార్.." అని టపీమని చెప్పాడు శిష్యుడు.

దొంగ కష్టం

"దొంగతనాలు చేసి బతికే కంటే కష్టపడి బతకొచ్చుగా..?" అడిగాడు జడ్జీ

"అంటే...నేను దొంగతనాలు చేయడానికి కష్టపడట్లేదనా మీ ఉద్దేశం. గోడలెక్కి కన్నం వేసి ఎంతో కష్టపడుతున్నాగా...?" అని జవాబిచ్చాడు దొంగ.

పెళ్లికీ ఓ లెక్కుంది

పెళ్లనగానే పలు రకాల పెళ్లిళ్లు మదిలో మెదులుతాయి. పెద్దల సన్నిధిలో పంతులుగారి వేద మంత్రాల మధ్య ... సంప్రదాయ బద్ధంగా జరిగేది వైదిక వివాహం. అమ్మాయి అబ్బాయి ఇష్టపడి ... నచ్చిన చోటకెళ్లిపోయి చేసుకునేది గాంధర్వ వివాహం. అమ్మాయి ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా బలవంతంగా చేసుకునేది రాక్షస వివాహం. కుల మతాల పట్టింపులు లేకుండా ఇద్దరూ ఇష్టపూర్వకంగా బంధుమిత్రుల మధ్య ... దండలు మార్చుకుని ... సాదాసీదాగా జరుపుకునేది ఆదర్శ వివాహం. ఇన్ని రకాల వివాహ క్రతువుల నడుమ... పెళ్లి గురించి నేటి యువతలో అనేక అభిప్రాయాలున్నాయి. లేటు వయసులో వివాహం గురించి ఆలోచించేవారు... లేత వయసులోనే బలవంతంగా పెళ్లి చేసుకునేవారు.. చదువుకున్న అమ్మాయిలకే మొగ్గు చూపేవారు... ఉద్యోగినులైతేనే 'ఊ' కొట్టేవారు... ఇతర రాష్ట్రాల నుంచి సంతలో కూరగాయల్లా వధువులను కొనుక్కొచ్చుకునేవారు... ఇలా... ఎన్నో రకాల వారు మన దేశంలో వున్నారు. అయితే వీటన్నిటికీ ఒక లెక్కుందని పలు సర్వేలు, అధ్యయనాలు చెప్తున్నాయి. అదేంటనేదే ఈ వారం అట్టమీది కథ.

- కె. అంజన

లేటు మ్యారేజీలు

లేటు వయసు పెళ్లిళ్లకు కేరాఫ్ అడ్రస్ జమ్మూ కాశ్మీర్, కేరళ రాష్ట్రాలే. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయంతో జరిగిన సర్వేలో ఈ అంశం వెలుగులోకి వచ్చింది. మలయాళీ పురుషులు 27 సంవత్సరాలు పైబడ్డాకే పెళ్లికి మొగ్గు చూపుతున్నారు. మహిళలు 22 సంవత్సరాలు నిండాకే పెళ్లి ఊసెత్తుతున్నారు. అక్షరాస్యత, ఆర్థిక స్వతంత్రత ఇందుకు కారణం. అయితే కేరళవాసులు పెద్దలు కుదిర్చిన వివాహాలు చేసుకోవడానికే ఇష్టపడతారని గ్లోబల్ మార్కెట్ సంస్థ ఐ.పి.ఎస్.ఒ.ఎస్ సర్వే చెప్తోంది. ఇక్కడి క్రిస్టియన్ యువతీయువకులు మాత్రం ప్రేమ వివాహాలకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నారు. చదువు, ఉద్యోగం, కెరీర్ విషయంలో ఎంతో ప్రగతిశీలంగా ఆలోచించినప్పటికి 75 శాతం కేరళవాసులు వివాహం సంప్రదాయ బద్ధంగా జరగాలనే కోరుకుంటున్నారు. 80 శాతం యువతులు తమ తల్లిదండ్రులు, కుటుంబం చూసిన అబ్బాయిని పెళ్లాడేందుకు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. అదే మిగతా దక్షిణాది రాష్ట్రాలకొచ్చేసరికి పెళ్లిళ్లు ఆర్భాటంగా చేసుకుంటారు. పెద్ద ఎత్తున బంధుమిత్రులను ఆహ్వానించి, రుచికరమైన విందు ఇచ్చేందుకే మొగ్గు చూపుతారని సర్వే వెల్లడిస్తోంది. లేటు వయసు వివాహాలకు కేరళ తర్వాతి స్థానాన్ని తమిళనాడు, కర్నాటక, అస్సాం, ఒడిషా ఆక్రమించాయి. వీరితో పోలిస్తే తెలంగాణా, ఆంధ్ర ప్రదేశ్ యువత త్వరగానే వివాహ బంధంలోకి అడుగెడుతున్నారనుకోవాలి. ఉన్నత విద్య, మంచి ఉద్యోగానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడంతో కేరళలో లేటు మ్యారేజీలు జరుగుతుంటే... అక్షరాస్యత తక్కువగా వుండడం,

సామాజిక ఒత్తిళ్ల కారణంగా ఈశాన్య రాష్ట్రాలకు చెందిన యువత లేత వయసులోనే వివాహం చేసుకోవాల్సి వస్తోంది.

కాశ్మీరీ యువకుల పెళ్లీడు వుండే కొద్దీ పెరిగిపోతోంది. ఒకప్పుడు 24 సంవత్సరాలుగా వున్నప్పటికీ తాజాగా మూడు పదులు దాటిపోయింది. ఆడపిల్లల పరిస్థితీ ఇలాగే వుంది. వారి పెళ్లీడు 21 నుంచి 28కి పెరిగిపోయింది. ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తరపున జరిపిన సర్వేలో ఈ అంశం వెలుగులోకి వచ్చింది. లేటు వయసులో వివాహాలకు అనేక చిక్కు లెక్కలే కారణం. ఏడడుగులు కలిసి వేయడానికి ముందుగా ఉద్యోగంలో స్థిర పడాలన్నది ప్రధాన కారణం. ఉన్నత చదువులు పూర్తి చేయడం... మంచి ఉద్యోగం సంపాదించుకోవడం... రెండూ కాలాన్ని హరించే అంశాలే. ఇవి రెండూ పూర్తయ్యేసరికి ఆడ-మగ అన్న బేధం లేకుండా ముప్పై సంవత్సరాలు నిండుతున్నాయి. పైగా తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు పి.హెచ్.డి, ఎం.ఫిల్ వంటి డిగ్రీలు పూర్తి చేయాలని... డాక్టర్లు, ఇంజనీర్లను పెళ్లాడాలనుకోవడం కూడా ఇందుకు కారణమౌతోంది. ఇది కాక పేదరికం, నిరుద్యోగం, వరకట్నం, ఆధునికత ప్రభావం, ఆరోగ్య సమస్యలు, సంస్కృతీ సంప్రదాయాలు, రాష్ట్రంలో నెలకొన్న అంతర్గత కల్లోలం వల్ల కూడా పెళ్లిళ్ల ఆలస్యమవుతున్నాయి. దీంతో వివాహానంతరం కాశ్మీరీ జంటలకు అనేక సమస్యలు వచ్చిపడుతున్నాయి.

చదువుకున్న అమ్మాయిలే కావాలి

పురుషాధిక్య భావజాలానికి, ఫ్యూడల్ పెత్తనానికి పెట్టింది పేరైన హర్యానాలోని మేవాత్‌లో ఈ మధ్య ఒక మార్పు వచ్చింది. అదేంటంటే చదువుకున్న అమ్మాయిలను పెళ్లి చేసుకోవడానికే యువకులు మొగ్గు చూపుతున్నారు. ఇంత అకస్మాత్తుగా ఈ మార్పు ఎందుకొచ్చిందబ్బా...? అంటే దానికీ ఓ లెక్కుంది. మనం రొటీన్‌గా చెప్పుకుంటామే! 'ఆడపిల్ల చదువు ఇంటికి వెలుగు. చదువుకున్న భార్య కుటుంబానికే దీపం. విద్య ప్రతి ఒక్కరి హక్కు' అని. వారిలో వచ్చిన మార్పుకు ఇవేవీ కారణం కాదు. మరి ఇంకేమై వుంటుంది అంటే...! ఇటీవల పంచాయతీ ఎన్నికలలో తమ కుటుంబ పెత్తనాన్ని చాటుకోడానికేనట ఈ ఎత్తుగడ. హర్యానాలో మరీ ముఖ్యంగా మేవాత్‌లో అక్షరాస్యత చాలా తక్కువ. ఆడవాళ్లలో మరీ తక్కువ. మహిళల రిజర్వేషన్ వున్న పంచాయతీ స్థానాలలో అభ్యర్థులకు కనీస విద్యార్హత వుండాలని ప్రభుత్వం ప్రకటించడంతో ఈ తిప్పలన్నీ వచ్చి పడ్డాయి. పంచాయతీ స్థానాలు తమ చేతుల్లోంచి జారిపోకుండా వుండేందుకు రెండవ పెళ్లికి సైతం సిద్ధపడేవారు, చదువుకుంటున్న కుమారులకు పెళ్లిళ్లు చేసేసేవారూ ఎక్కువైపోయారు.

దేశంలోకెల్లా అత్యధిక అక్షరాస్యతకు పెట్టింది పేరైన కేరళ యువకులు చదువుకున్న అమ్మాయిలను పెళ్లాడేందుకు ఇష్టపడుతున్నారు. అయితే అందుకు హర్యానాలో మాదిరిగా ... స్వార్థ రాజకీయాలు మాత్రం కారణం కాదు. చదువులోను, ఉద్యోగంలోనూ తమతో సమంగా వున్న అమ్మాయిలను జీవితంలోకి ఆహ్వానించేందుకు వారు ఇష్టపడుతున్నారు. కుటుంబ భారమంతా ఒక్కరి మీద వుండే కంటే కుటుంబమనే వాహనానికి రెండు చక్రాల్లాంటి భార్యాభర్తలిద్దరి మీదా వుంటే మంచిదని వారి అభిప్రాయం. పైగా ఆడవాళ్లను కూడా మగవారితో సమానంగా చూడాలన్నది వారి అభిమతం. పైగా ఉద్యోగస్తురాలైన భార్య తనను ఏమాత్రం తక్కువగా చూడదన్న ఆలోచన వారిది. ఇంట, బయట, ఆర్థికాంశాలలో భార్యాభర్తలిద్దరూ సమానమే. వంట, వార్పు, పిల్లల పెంపకం, బట్టలు ఉతకడం మొదలుకొని... బయటి పనులు చేయడం వరకు ఇద్దరూ కలిసి చేసుకోవాలన్నది వారి ఆలోచన. అయితే ఈ ఆలోచనలు ఎక్కువగా పట్టణ ప్రాంత యువతలో కనిపిస్తాయి.

వధువును కొనుక్కోవాల్సిందే

పంజాబ్, హర్యానా అబ్బాయిలు ఎదిగే కొద్దీ పెద్దలకు భయం పెరిగిపోతుంటుంది. వాళ్లకు పిల్లను వెతికి పెళ్లి చేయాలంటే సొంత గడ్డ దాటి ... పొరుగు రాష్ట్రాలు పయనమవ్వాలి. మధ్యవర్తులను పట్టుకోవాలి. కాళ్లావేళ్లా పడాలి.

అవసరమైతే వారి చేతులూ తడపాలి. మరీ తొందరగా పనవ్వాలంటే పర్సెంటేజీ ఇవ్వాలి. తెల్ల పిల్ల కావాలంటే ఇంకొంచెం కష్టడాలి. ఇదంతా ఎందుకు? సొంత రాష్ట్రాలలో ఆడపిల్లలు లేరా? అంటే ఆడపిల్లల లెక్క తప్పినందుకే ఈ శ్రమంతా. అమ్మాయిలు ఇంత తక్కువగా ఎందుకున్నారంటే... 'చేసుకున్న వారికి చేసుకున్నంత' అని పెద్దలన్నారే. అందుకు. ఒకప్పుడు మగపిల్లాడే పుట్టాలి. ఆడపిల్ల వద్దనుకుని అబార్షన్లు చేయించేశారు. ఆ పాప ఫలమే ఇప్పటి తరానికి శాపమైంది. మగపిల్లలకు పెళ్లి చేద్దామంటే ఆడపిల్లలే కరవయ్యారు. స్త్రీపురుష నిష్పత్తి దారుణంగా పడిపోయింది. ప్రతి వెయ్యి మంది పురుషులకు పంజాబ్‌లో 893 మంది అమ్మాయిలు, హర్యానాలో 877 మంది ఆడపిల్లలు వున్నారు. దాంతో అబ్బాయికి అమ్మాయిని వెతకడం కష్టమైపోతోంది. సొంత గ్రామం, సొంత జిల్లా మాట అటుంచి సొంత రాష్ట్రంలోనే దొరకడం కష్టమైపోతోంది. మగవాళ్లకు 35 సంవత్సరాలు పైబడుతున్నా పెళ్లి లేకుండానే నెట్టుకురావాల్సి వస్తోందని 'దృష్టి స్త్రీ అధ్యయన ప్రబోధన కేంద్రం' చేసిన సర్వే చెప్తోంది. హర్యానాలోని 92 గ్రామాల్లో సర్వే చేశారు. ప్రతి గ్రామంలోనూ దాదాపు 50 మంది అమ్మాయిలు అస్సాం, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, బీహార్, ఒడిషాకు చెందినవారుగా తేలింది. ఇక్కడ కూడా అమ్మాయి నల్లగా వుండకూడదు. పుష్టిగా వుండి పనిపాటలు చేయగలగాలి. అలాంటివారినే ఎంపిక చేసుకుంటారు. ఆ కుటుంబాలకు 50 వేల రూపాయల నుంచి రు 3 లక్షల వరకు చెల్లించి కోడళ్లుగా తెచ్చుకున్నారు. సొంత రాష్ట్రంలో అయితే కులం, మతం వంటివి చూస్తారు. ఇక రాష్ట్రమే దాటాక వాటి ఊసే వుండదు. భాష, సంస్కృతి, సంప్రదాయాలు వేరైనా అయినవారందరికీ దూరంగా ఎక్కడో కుగ్రామంలో బిక్కుబిక్కుమంటూ బతకాల్సిందే ఆ అమ్మాయిలు. అధికశాతం మహిళలు అత్తగారింట బండెడు చాకిరీ చేస్తూ, వారసులను (మగపిల్లలను) కనిపెంచేందుకే కొవ్వొత్తులా కరిగిపోతుంటారు.

ఒంటరి మహిళల వైపే మొగ్గు

మొదటి సారి పెళ్లిళ్లు చేసుకునేవారి సంగతులు చాలానే వచ్చాయి. భాగస్వామి చనిపోయినప్పుడో...విడిపోయినప్పుడో సంగతేంటి? అంటే... ఈ కోవకు చెందిన 53 శాతం మగవాళ్లు పునర్వివాహం చేసుకోదల్చుకున్నప్పుడు ఒంటరి మహిళల వైపే మొగ్గు చూపుతున్నారని 'జీవనసాథీ డాట్ కామ్' సర్వే చెప్తోంది. 62 శాతం కుటుంబాలు సైతం తమ కుమారులు ఒంటరి మహిళలను పెళ్లి చేసుకుంటే మంచిదని భావిస్తున్నాయి. భర్త చనిపోయి, లేదా విడాకులు తీసుకొని ఒంటరులైన వారిని ఇక్కడ ఒంటరి మహిళలుగా చెప్పుకోవాలి. విడాకులు తీసుకున్న 76 శాతం హర్యానా పురుషులు, 64 శాతం ఒరిస్సా మగవాళ్లు ... ఒంటరి మహిళలను వివాహం చేసుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. అయితే హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన వారు మాత్రం విడాకులు తీసుకున్న వారిని లేదా ఒకసారి కూడా పెళ్లి చేసుకోని వారినే ఇష్టపడుతున్నారు.

55% కులాంతర వివాహాలే

సాధారణంగా 95 శాతం భారతీయులు సొంత కులాల నుంచే జీవిత భాగస్వామిని ఎన్నుకుంటారు. అలాంటిది చిన్ని రాష్ట్రమైన మిజోరాంలో కులాంతర వివాహాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆ రాష్ట్రంలో క్రిస్టియన్లు ఎక్కువ. కచ్చితంగా చెప్పుకోవాలంటే జనాభాలో 87 శాతం వాళ్లే. అక్కడ సగానికి పైగా (55 శాతం) పెళ్లిళ్లు కులాంతర వివాహాలే. మిజోరాం తర్వాతి స్థానాన్ని జమ్మూ కాశ్మీర్ (35 శాతం), గుజరాత్ (13 శాతం) ఆక్రమించాయి. ఢిల్లీకి చెందిన 'నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనమిక్ రీసెర్చ్' (ఎన్.సి. ఎ.ఇ.ఆర్) సంస్థ ఈ ఏడాది చేసిన ఒక అధ్యయనంలో ఈ అంశం వెలుగులోకి వచ్చి ంది. దేశంలోని మిగతా రాష్ట్రాలకు భిన్నంగా ఇక్కడ మాత్రమే కులాంతర వివాహాలను ఎందుకు చేసుకుంటున్నారు? అంటే దీనికీ ఓ లెక్కుంది. అధ్యయన సమయంలో సేకరించిన సమాచారం ప్రకారం ఆర్థిక అభివృద్ధి, ఆధునికతలే ఈ మార్పుకు కీలక కారణమని తేలింది.

అయితే ఇందుకు పూర్తి భిన్నమైన రాష్ట్రం మధ్యప్రదేశ్. ఇక్కడ 99 శాతం పెళ్ళిళ్లు సొంత కులాల్లోనే చేసుకుంటారు. హిమాచల్ ప్రదేశ్, చత్తీస్‌గఢ్ ఆ తర్వాత చెప్పుకోవాల్సిన రాష్ట్రాలు. ఇక్కడ 98 శాతం పెళ్లిళ్లు అవే. ఈ రాష్ట్రాలలో తల్లిదండ్రులు తమ పిల్లలకు అన్ని రకాల స్వేచ్ఛలను ఇస్తారు. బట్టలు, తిండి, కెరీర్‌కు సంబంధించిన ఎంపిక పిల్లలే చేసుకుంటారు. అమ్మానాన్నలు ఏ విధమైన అభ్యంతరాలు పెట్టడం కానీ, ఇదే తీసుకోవాలని-వేసుకోవాలని పట్టుబట్టడంకానీ వుండవు. అదే జీవిత భాగస్వామి దగ్గరకొచ్చేసరికి మాత్రం సొంత కులాన్ని, మతాన్ని దాటి బయటకు పోవడానికి అంగీకరించరు. పర కులస్తులను, మతస్తులను తమ అల్లుళ్లగాను, కోడళ్లుగాను చేసుకునేంత విశాల ఆలోచనలు రాకపోవడమే అందుకు కారణం.

వధువుల కొరత

ఎక్కడో హర్యానా, ఉత్తరప్రదేశ్, బీహార్‌లో కాదు. కర్నాటకలో సైతం ఈ సమస్య వుంది. అయితే రాష్ట్రంలోని బ్రాహ్మణ కుటుంబాలలో మాత్రమే. వీరు వెయ్యి కళ్లతో వివాహ ఘడియ

కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. దాంతో లేటు వయసు వివాహాలు తప్పడం లేదు. అసలు కారణం రాష్ట్ర జనాభాలో వారు కేవలం 3.2 శాతం మాత్రమే వున్నారు. మరో రెండు మూడు దశాబ్దాల కాలం కరిగిపోయేసరికి ఆ సంఖ్య మరింతగా పడిపోయే ప్రమాదముందని వారు ఆందోళన చెందుతున్నారు. యువకులు ఇంజనీరింగ్, వైద్యం వంటి సాంకేతిక విద్య అభ్యసించకపోవడం, డిగ్రీలు చదివి స్వయం ఉపాధి చేపట్టడం కూడా సమస్యకు కీలక కారణంగా కనిపిస్తోంది.

బాల్యం బంధీ !

మన దేశంలో ఆడపిల్లకు 18, మగపిల్లాడికి 21 సంవత్సరాలు వస్తేనే పెళ్లికి అర్హులని చట్టం చెప్తుంది. అయితే సగానికి సగం పైగా ఆడపిల్లలకు పద్దెనిమిదేళ్లలోపే పెళ్లిళ్లు జరుగుతున్నాయని యునిసెఫ్ చెప్తోంది. పశ్చిమ బెంగాల్‌లో సైతం పందొమ్మిదేళ్ల లోపే ఆడపిల్లలకు పెళ్లిళ్లయిపోతుంటాయి. ఇలాంటి రాష్ట్రాలు దేశంలో తొమ్మిదికి పైగానే వున్నాయి. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, బీహార్, జార్ఖండ్ వంటి రాష్ట్రాలలో ఈ సంఖ్య మరింత ఎక్కువగా వుంది. కర్నాటకలోనూ తక్కువేం కాదు. పసివయసులోనే, ఆటపాటలు, చదువులు,



పాఠశాలలకు దూరంగా అత్తవారిళ్లలో బాధ్యతల బండలు ఎందుకు మోయాల్సి రావడానికీ ఓ లెక్కుంది. ఏనాడో పురాతన కాలంలో స్వలాభం కోసం పెట్టిన సామాజిక నియమాలు, సంప్రదాయాలు కుటుంబంలో ఆడపిల్ల పాత్రను నేటికీ నియంత్రిస్తున్నాయి. అవే బాల్య వివాహాలకు పురికొల్పుతున్నాయి. వీటికి తోడు వరకట్నం, పేదరికం...బాల్య వివాహాల సంకెళ్లను ఛేదించనివ్వకుండా అడ్డుకుంటున్నాయి.

ఇక ఈ బాల్య వివాహాల్లో ఎన్ని విజయవంతం అవుతున్నాయి? ఎన్ని విఫలం అవుతున్నాయి? అంటే మొత్తంగా ఒక అధ్యయనం లేకపోయినా కర్నాటకలో మాత్రం చైల్డ్ రైట్స్ అండ్ యు (క్రై), 'సామాజిక పరివర్తన జనాందోళన సంస్థ'లు సంయుక్తంగా చేసిన అధ్యయనంలో ఓ ఆసక్తికరమైన అంశం వెలుగులోకి వచ్చింది. రాష్ట్రంలో ప్రతి మూడు బాల్య వివాహాల్లోనూ ఒకటి విఫలమౌతోంది. ఆరు జిల్లాల్లోని (రాయచూర్, గుల్బర్గ, బెల్గాం, హావేరి, దావనగరి, బెంగళూరు) 93 ప్రాంతాల్లో చేసిన సర్వేలో ఈ విషయం తెలిసింది. అవిద్య, ఫ్యూడల్ మనస్తత్వం కారణంగా పిల్లలను బడికి దూరం చేస్తున్నాయని, బలవంతపు వివాహ బంధంలో ఇరికిస్తున్నాయని తేలింది. అధ్యయనం చేసిన వారిలో 15 శాతం అమ్మాయిలు ఎన్నడూ బడి మొహమే ఎరగరు. 49 శాతం మంది సుదూర ప్రాంతాలలో స్కూళ్లు వుండడంతో ఉన్నత పాఠశాల విద్యకు దూరమయ్యారు. అయితే అమ్మాయిలను చదువుకు దూరం చేయడంలో కులం కూడా ప్రధాన పాత్ర వహించినట్లు అధ్యయనం చెప్తోంది. లెక్కంటేనే ఆర్థికం. అన్ని బంధాలనూ శాసించేది, ప్రభావితం చేసేది ఇదేనని పెద్దలు పూర్వమే చెప్పారు. ఇవాళ వివాహ బంధంలోనూ ఇదే ప్రతిబింబిస్తోంది. జీవితం సుఖ ప్రదంగా నడవాలంటే ఏ లెక్కను చుక్కానిగా చేసుకోవాలనేది తేల్చుకోవాల్సింది మాత్రం యువతే. ✦

చిన్న వయసులో పెళ్లయితే...

- చిన్నారులు...శారీరకంగా, మానసికంగా ఎదగాల్సిన వయసులో అనేక భారాలను మోయాల్సి వస్తుంది.
- తమ ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా అనేక రకాల చిత్రహింసలకు గురికావాల్సి వస్తుంది.
- పసివయసులోనే గర్భం దాల్చడంతో అబార్షన్లు, రక్తహీనత వంటి అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవాలి.
- ప్రసవ సమయంలో ప్రాణం మీదకు వచ్చే ప్రమాదం వుంది.
- పలు ప్రాథమిక హక్కులతో పాటు చదువుకూ దూరం కావడంతో విజ్ఞానవికాసాలు అంతంత మాత్రంగానే వుంటాయి.

లేటు వయసులో వివాహమైతే...

- చదువు, మంచి ఉద్యోగం, ఆదాయం, మానసిక–శారీరక పరిణతి వంటివి ప్లస్ పాయింట్లు.
- ఆర్థికాంశాలకు అధిక ప్రాధాన్యత... భాగస్వామికి ద్వితీయ ప్రాధాన్యత.
- వారికోసం అంత సమయం కేటాయించలేరు. సంసార జీవితంపైనా ప్రభావం వుంటుంది.
- వయసు పైబడడంతో వెంటనే పిల్లల కోసం పరుగులు తీయాల్సి వస్తుంది.
- ప్రసవ వేళ ప్రమాదాలను ఎదుర్కోవాల్సి రావడం మైనస్ పాయింట్లు.

అతివృష్టి ...అనావృష్టి రెండూ అనర్థదాయకమే. సంతులనంతో అడుగేయడమే విజ్ఞత.

ద్రాక్ష మణి



జపాన్‌లో మణులు, మాణిక్యాల కన్నా పళ్ళు, కాయలెక్కువ ఖరీదు చేస్తున్నాయి. ఆహార సంక్షోభం కాదులెండి. అతి అరుదైన జాతి పళ్లని కొనడం అక్కడ స్టేటస్ సింబల్ అయిపోయింది. వేలకు వేలు పోసి వివాహాది కార్యక్రమాల కానుకలుగా వాటిని ఇవ్వడం ట్రెండ్ అయిపోయింది. మొన్నామధ్య స్థానిక సూపర్ మార్కెట్ యజమాని తకమారు కొనిషి అటు ఇటుగా లక్ష రూపాయలు తగలేసి కొన్న 'రూబీ రోమన్' ముప్పావు కేజీ ద్రాక్ష పళ్ల గురించే అందరూ మాట్లాడుకుంటున్నారు. తకమారుకు కావాల్సిందదే. వాటిని తన దుకాణంలో పెడితే క్యూలు కట్టి మరీ జనం వచ్చి చూసెళుతున్నారు. వెళ్తూ వెళ్తూ ఏదోకటి కొనకుండా ఎందుకుంటారు. జపాన్ ప్రభుత్వ సారథ్యంలో ఓ అగ్రిటెక్ సంస్థ ఈ జాతి ద్రాక్షల్ని ప్రవేశపెట్టింది. దీనికి 16 ఏళ్ల కాలం పట్టింది. ఈ ఏడాది తొలి కాపుగా వచ్చిన వీటికి చాలా లెక్కలే ఉంటాయి. ఒక్కో ద్రాక్ష పండు 20 గ్రాముల బరువుండాలి, దానిలో 18 శాతం కంటే ఎక్కువ చక్కెర శాతముండాలి, ద్రాక్ష గుత్తు మొత్తం బరువు 700 గ్రాములుండాలి. ఇషికావా ప్రాంతంలో ప్రత్యేకంగా పెంచుతున్న రూబీ రోమన్‌లు ఫుజిమోరీ వంగడం నుంచి వచ్చినవి.

రాజకుమారుడి విందు

వింత లోకం



అనగానే భారీ డైనింగ్ రూమ్.. వందల రకాల వంటకాలు ఊహించుకోకండి. ఈ రాజకుమారుడు విందు ఓ ఫుడ్ ట్రక్‌లో దొరుకుతుంది. తానే గల్లా పెట్టె దగ్గర ఉండి వేడి వేడిగా పాస్తాను అందిస్తాడు. పాస్తా అనగానే ఇటలీ గుర్తు రావడం మంచిదే. ఈ ప్రిన్స్ ఇటలీ చివరి రాజ కుటుంబం హౌజ్ ఆఫ్ సవాయ్స్‌కు చెందినవాడు. ప్రభుత్వం గుర్తించడం లేదు కానీ ప్రిన్స్ ఆఫ్ వెనీస్ మనోడు. ఇప్పుడు మాత్రం అమెరికాలోని కాలిఫోర్నియా వీధుల్లో వంటశాల ఉన్న ఓ ట్రక్కును తిప్పుతూ గడిపేస్తున్నాడు. యుంబెర్టో 2 పాలనలో ఉండగా ప్రజా పాలన వచ్చి రాజ కుటుంబాన్ని వెలేసింది. జెనీవా వెళ్లిపోయిన యుంబెర్టోకి ఇమాన్యులె ఫిలిబెర్టో పుట్టాడు. 2002లో రాజ కుటుంబాల్ని దేశంలోకి తిరిగి అనుమతించడంతో ఇమాన్యులె మంచి సెలబ్రెటీగా గడిపాడు. టీవీ షోలు, ఫ్యాషన్ షోలు, రెడ్ కార్పెట్‌లలో బానే కలియ తిరిగాడు కానీ ఆ జీవితం నచ్చలేదు. అమెరికాకు విహారానికి వెళ్లాక లాస్ ఏంజెల్స్ నగరంలో రంగుల రంగుల ట్రక్కులు ఫుడ్ కోర్ట్‌లుగా తిరగడం భలే నచ్చేసింది. మెక్సికో, ఆసియా వంటకాలే ఎక్కువ ఉండటంతో తమ పాస్తా వెరైటీల్ని రుచి చూపించాలని అలా మారిపోయాడు. ఇంతకీ ఆ ట్రక్కు పేరేంటంటే 'ప్రిన్స్ ఆఫ్ వెనీస్'.



హృదయాన్ని ఫాలో అవుతూ..

నార్వేకు చెందిన ఓ కుటుంబం వారి ఇంటిపేరును హెర్టెఫోల్గెర్‌గా మార్చుకుంది. అంటే అర్థం హృదయాన్ని అనుసరించేవారని. వారి గుండె మాటేంటంటే ప్రకృతితో కలసి బతకాలని. అందుకే ఆర్కిటిక్ సర్కిల్‌లోని సాండ్‌హార్నీ ద్వీపానికి చేరుకుని సముద్రానికి దగ్గరగా అడవి అంచున ఓ అర్ధ గోళ గాజు పెట్టెలో ఇల్లు కట్టేసుకున్నారు ఇన్‌గ్రిడ్, బెంజమిన్‌ల జంట. మట్టి, గడ్డితో కట్టిన ఆ రెండంతస్తుల ఇంట్లోనే వారి నలుగురు బిడ్డల బాల్యం గడవాలనేది కోరిక. ఆ గాజు గోళంలోనే యాపిల్, టమాటా, బీట్‌రూట్, వంకాయ మొక్కలు ఇలా ఓ పెరడు కూడా ఏర్పాటు చేసుకున్నారు. గాలి, వెలుతురులు ధారాళంగా ఆడటమే కాదు విద్యుత్ అవసరాన్ని చాలా తగ్గించేస్తుందీ నిర్మాణం. వాడిన నీరు కూడా మొక్కలకు పోయి వృథా అనే మాటే రాని పర్యావరణహిత గృహమిది. చిన్నారులు ఇక్కడ చాలా గొప్ప జీవితాన్ని గడిపేస్తున్నారు. తల్లితో కలసి కాయగూరలు పండించడం, తండ్రితో కలసి అడవిలో తిరగడం.. కుటుంబమంతా కలసి సముద్ర తీరం వెంబడి నడవడం అంతా ఒక ఫాంటసీ కథలా ఉంటుంది. రాత్రుళ్లు ఆకాశంలో అరోరా (ధృవపు జ్యోతి) వెదజల్లే కాంతుల్లో జానపద కథలు వింటూ నిద్రలోకి జారే అవకాశం ఎందరికొస్తుంది చెప్పండి.

స్త్రీ జీవితానికి నిలువుటద్దం

మన సమాజంలో స్త్రీలు తమ అస్తిత్వాన్ని నిలుపుకునే ప్రయత్నంలో కొంత విజయం సాధించినా, ప్రపంచీకరణతో సంక్లిష్టమైపోయిన జీవన పోరాటంలో మారుతున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితుల నేపథ్యంలో తమ విలువలను కాపాడుకునే ఒక ప్రయత్నం... అందుకోసం జరుపుతున్న సంఘర్షణలు 'సత్యవతి కథలు'లో కనిపిస్తాయి. ఈ కథలలో రచయిత సృష్టించినవి పాత్రలు కాదు... నిత్యం మన కళ్లముందు నడయాడే సజీవ చిత్రాలు. ఈ కథా సంకలనంలో 40 కథలున్నాయి. ఇవన్నీ స్త్రీ పాత్రలే ప్రధానంగా సాగినవే. కుటుంబ జీవితంలో కోల్పోయిన తమ అస్తిత్వాన్ని వెదుక్కొనే ప్రయత్నం చేస్తూనే.. సామాజిక అస్తిత్వం కోసం పోరాటం చేస్తాయి ఈ పాత్రలన్నీ. ఒక్క మాటలో చెప్పాలంటే స్త్రీ జీవితానికి నిలువుటద్దం పి.సత్యవతి గారి కథలు. 'గోవు'లో గోమతి, 'కాడి'లో దుర్గ తమ అస్తిత్వం కోసం వ్యవస్థ మీద పోరాడే పాత్రలే. అలాగే... 'బదిలీ', 'పెళ్లి', 'ప్రయాణం' వంటి కథల్లో.. మానసిక, ఆర్థిక, సామాజిక బంధనాల నుంచి విముక్తి పొందడంతో పాటు వస్తు వ్యామోహం నుంచి కూడా బయట పడటం వంటి అంశాల నేపథ్యం కనిపిస్తుంది. 'సూపర్ మామ్ సిండ్రోమ్', 'మంత్రనగరి'లో స్త్రీల జీవితాల్లోని విషాదాన్ని మన కళ్ల ముందు ఆవిష్కరింపచేస్తారు.

సత్యవతి కథలు
రచయిత: సత్యవతి
వెల: 270/-
పేజీలు: 384/-
ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

'అరుణ సంధ్య' కథలో... పక్క వాటాలో ఉన్న విద్యార్థికి సంబంధం అంటగట్టినా, మరిగే కాఫీ నెత్తి మీద పోసినా, తినే అన్నం మొహానికి పులిమినా, పుట్టింటికి వెళ్ళొచ్చేసరికి పడక గదిలో కనిపించే పగిలిన గాజులు, ఎండిన పూలు, ఖాళీ కండోమ్ పాకెట్లు ఊడ్చుకుని, పరుపులు ఎండేసుకుని, ఇల్లు డెట్టాల్‌తో కడుక్కునే అరుంధతిలో భర్త చేస్తున్న అవమానాన్ని ఎదుర్కోడానికి సిద్ధపడుతుంది. ఆర్థికంగా బలపడడం ద్వారా తన వ్యక్తిత్వాన్ని నిలుపుకోవచ్చన్న ఆకాంక్ష ఆమె ఎవరికీ చెప్పకుండా అమెరికా వెళ్లేలా చేస్తుంది. తద్వారా తన వ్యక్తిత్వాన్ని కాపాడుకునే ప్రయత్నాన్ని సత్యవతి గారు చక్కగా అక్షరీకరించారు. 'ఇల్లలకగానే' కథలో.. సంసారసాగరంలో ఇల్లు, పిల్లలు, భర్తే తన ప్రపంచంగా బతికే ఓ ఇల్లాలు తన పేరేంటో కూడా గుర్తుపెట్టుకోలేని ఒక నిస్సహాయ స్థితిలో నిలబడుతుంది. తన పేరు తెలుసుకోవడం కోసం తాను చేసే ప్రయత్నం, తన పేరు తెలుసుకున్న తర్వాత వెల్లువలా పొంగివచ్చే జ్ఞాపకాలలో తడిసి ముద్దవుతుంది.

'దమయంతి కూతురు' కథలో.... కూతురు తప్ప ఎక్కడా దమయంతి కనబడదు. స్త్రీల వ్యక్తిత్వం, మాతృత్వం అనే రెండు అంశాలను తీసుకుని చర్చించినట్లుగా కనిపిస్తుంది. స్త్రీలు తమ సంకెళ్ళను తెంచుకుని నచ్చిన వ్యక్తి కోసం వెళ్ళిపోవడమనేది కథల్లో, నవలల్లో కొత్త అంశం కాకపోవచ్చు. కానీ అలా వెళ్ళిపోవడమనేది అనేక సందర్భాల్లో స్త్రీల లైంగికతతో ముడిపెట్టి చూపుతుంటారు. అలాంటి వాదోపవాదాలకు బ్రేక్ వేసినట్టుగా ఈ కథ కనబడుతుంది.

ఆలోచనలను రేకెత్తించగలిగే అనేక కథలు ఈ సంకలనంలో వున్నాయి. ఇక రచయిత శైలి, శిల్పం గురించి ప్రత్యేకంగా చెప్పేదేముంటుంది. ఆమె బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆమె కథల్లోని ఇతివృత్తం చాలా చిన్నగా ఉన్నట్లనిపిస్తుంది. కానీ అందులో ఒక జీవితాన్ని చొప్పిస్తారు. అదే రచయిత్రి గొప్పతనం.

- రాజాబాబు కంచర్ల

పెళ్లంటే పదిళ్ల పంట



పెళ్లంటే తాళాలు తలంబ్రాలు, ఆకాశమంత పందిరి వేసి ఇంటిల్లిపాది ఎంతో సంబరంగా సంతోషంగా జరుపుకుంటారు. అలాంటివేమి లేకుండానే పెళ్లికి ఎంత ఖర్చు అవుతుందో ఆ డబ్బు మొత్తం ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలకు ఇచ్చారు. సాదాసీదాగా రిజిస్టర్ వివాహం చేసుకుని ఎందరికో ఆదర్శంగా నిలిచారు అభరు దివారే, ప్రీతి కుంభారే. ఈ యువ జంట పరిచయం, ప్రేమ, పెళ్లి అంతా సమాజానికి ఓ మంచి సందేశమనే చెప్పాలి.

అభరు దివారే ఇటీవలే ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్)కి ఎంపికయ్యాడు. నాగపూర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్ (ఎన్ఏడీటీ)లో ట్రైనింగ్‌కు వెళ్లనున్నాడు. ప్రీతి కుంభారే.. ఐడీబీఐ ముంబై బ్రాంచ్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తోంది. యూపిఎస్సీ, ఎంపీఎస్సీ పరీక్షల కోసం సన్నద్ధమవుతుండగా ఇరువురి మధ్యా పరిచయం పెరిగింది. ఆ పరిచయం ప్రేమకు దారి తీసింది.

ఇద్దరూ అమరావతిలోని అభియంత భవన్‌లో పెళ్లి చేసుకున్నారు. ఆ పెళ్లిలో బాజాభజంత్రీలు లేవు. హంగులు, ఆర్భాటాలు అసలే లేవు. చాలా సాదాసీదాగా.. ఒక్కటయ్యారు. అయితే పెళ్లికయ్యే ఖర్చును ఓ మంచి పనికి ఉపయోగించాలనుకుంది ఆ జంట. ఆత్మహత్యలు చేసుకున్న పది రైతు కుటుంబాలను ఎంచుకుని ఒక్కో కుటుంబానికి రూ.20వేలు చొప్పున ఇచ్చారు. అంతేకాకుండా అమరావతిలోని ఐదు లైబ్రరీలకు 52వేలు విలువ చేసే వివిధ పోటి పరీక్షల పుస్తకాలను అందించారు. అయితే ఈ డబ్బంతా వాళ్ల తల్లిదండ్రుల దగ్గర నుండి తీసుకోలేదు. అమ్మాయి, అబ్బాయి ఇద్దరూ కష్టపడి సంపాదించిన డబ్బునే ఇలా వివిధ పనులకు ఉపయోగించారు. సింపుల్‌గా స్టేజ్‌పై రిజిస్టర్ మ్యారేజ్ చేసుకోవడమే కాదు విందులో కూడా చపాతి, అన్నం, పప్పు, కూరగాయలు మాత్రమే వడ్డించారు.. వీరు చేసిన ఈ పనిని అందరూ శభాష్ అని మెచ్చుకుంటున్నారు.

- జాన్ ప్రభాకర్ పీతల



థాయ్‌ల్యాండ్‌లో ట్రెకింగ్, అట్లాంటిక్ సముద్రంలో డైవింగ్, మాయన్ పిరమిడ్ వద్ద పారాగ్లైడింగ్, జిప్సీతెగతో రోడ్ క్యాంపెయిన్లు, క్రియాశీల అగ్నిపర్వతాల సందర్శన, గిలి ద్వీపంలో వరదలు, నేపాల్ భూకంపంలో ప్రమాదకర సంఘటనలు ఇవన్నీ సాహస యాత్రల్లో ఆరితేరిన వారి అనుభవాలు కాదు. ఢిల్లీకి చెందిన లీనా బన్సాల్ ఒంటరి ప్రయాణంలో అనుభూతులు. ఎన్నో అందమైన దేశాల్లో ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తాయి. వాటిని ఎదుర్కొని నిలబడిన ఆ దేశాల్ని ప్రత్యక్షంగా చూసిన ఆమెకి మరో ఒంటరి ప్రయాణానికి ధైర్యం రెట్టింపయ్యింది.

ఒంటరిగా ... 37 దేశాలు...

అమ్మాయిలు ఏదైనా టూర్ అని చెప్పగానే చాలామంది తల్లిదండ్రులు ముందు నో చెప్పేస్తుంటారు. అదే ఒంటరి ప్రయాణమైతే ఇక ఆ టూర్‌ని ప్లాన్ చేయడమే కాదు ముందుకు సాగడం కూడా అమ్మాయిలకి కత్తిమీద సాములాంటిదే. కొత్త ప్రదేశాల్లో ఎక్కువగా దొంగతనాలు, ప్రమాదాలు ఉంటాయంటూ ఎప్పుడు ఎలాంటి పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందోనని తెగ కంగారుపెట్టేస్తుంటారు. ఒంటరి ప్రయాణాలు అమ్మాయిలకి మంచివి కావని వారిస్తుంటారు. అన్ని చోట్లా చెడుతోపాటు మంచి ఉంటుంది. సామాజిక మాధ్యమాల్లో నెగటివ్ న్యూస్ ప్రచారం ఎక్కువవడంతో అన్నీ ప్రమాదకరంగా భావిస్తూ అన్నిటికీ కంగారు పడిపోతున్నారు. ఎవరో ఒకరు చెప్పే మాటల్ని విని అక్కడే ఆగిపోకుండా ముందడుగేస్తే ప్రపంచం గురించి ఎన్నో విషయాలు తెలుస్తాయనేది లీనా సిద్ధాంతం. ప్రపంచం నుండి మనం నేర్చుకోవాల్సిన అంశాలు ఎన్నో ఉంటాయి. ఇతరులిచ్చే సలహాలతో మనం అప్పుడప్పుడూ ధైర్యాన్ని కోల్పోతుంటాం. మనమే సొంతగా ప్రపంచాన్ని అన్వేషించగలిగితే ప్రకృతిలో ఉండే ప్రతి ప్రదేశం అందంగా కనిపిస్తుందంటారు లీనా.

మంచు లోకాన్ని చూస్తా...

లీనా చిన్నతనంలో ఒకరోజు టీచర్ పిల్లలందర్నీ పెద్దయ్యాక ఏమవ్వాలనుకుంటున్నారని ప్రశ్నించింది. డాక్టర్, లాయర్, ఇంజనీర్, టీచర్ ఇలా ఒక్కొక్కరూ ఒక్కో సమాధానం ఇచ్చారు. లీనా మాత్రం తను అంటార్కిటికా చూడాలనుకుంటున్నానని చెప్పడంతో అందరూ నవ్వేశారు. అయితే తన జవాబు మాత్రం టీచర్‌కి తెగనచ్చేసింది. అంటార్కిటికా ఎలా వెళ్లాలో తెలుసా అంటూ అందరూ ప్రశ్నించారు. అప్పుడు తనకి తెలిసిన దారులేవో చెప్పి తప్పించుకున్నా యాత్రపై తన ధ్యాస మారలేదు. 19 ఏళ్లకే ఒక విదేశీ పర్యటన చేసొచ్చిన లీనాకి యాత్రకి కావాల్సిన డబ్బు, ఖర్చులపై కొంత అవగాహన వచ్చింది. ప్రపంచ యాత్ర చేయాలనే తన కల నెరవేరాలంటే మంచి ఉద్యోగం సాధించాలనుకున్న లీనా అడ్వర్‌టైజింగ్ రంగంలో ప్రొఫెషనల్‌గా స్థిరపడింది. 2011లో బ్యాక్‌పాకర్‌గా మారి సింగపూర్, మలేషియా దేశాల్ని చుట్టొచ్చింది. ఆ అనుభంతో 2014లో ప్రపంచ టూర్‌ని ప్లాన్‌చేసుకుంది. తను చేరుకోవాల్సిన ప్రదేశాల కంటే ముందు ప్రయాణానికి అయ్యే ఖర్చులు, వీసా, పాస్‌పోర్ట్, యూరైల్ పాస్, వివిధ దేశాల్లో నౌకాప్రయాణ ఖర్చులు తదితర సమాచారంతో పాటు (రౌండ్ ది వరల్డ్ ట్రిప్) ప్రపంచాన్ని చుట్టిరావాలనుకున్న దేశాల్లో యాత్ర పర్యాటన నియమాల్ని తెలుసుకుంది. యూరప్, ఉత్తర అమెరికా–మెక్సికో, ఆసియా ఈ మూడు ఖండాల్లో చూడాలనుకునే ప్రదేశాలని లిస్ట్‌అవుట్ చేసుకోవడానికి కొంచెం కష్టపడాల్సొచ్చింది. ఆమె తొలి అడుగులు ప్యారిస్ దిశగా సాగాయి. వేలాది పెయింటింగ్స్ ప్యారిస్ నగరవీధుల్లో ఎక్కడ చూసినా దర్శనమిస్తాయి. ప్యారిస్‌లోని వివిధ మ్యూజియంలతో పాటు రాత్రిళ్లు విద్యుత్ వెలుగుల్లో మిరిమిట్లు గొలిపే ప్యారిస్ నగర వీధులపై మనసు పారేసుకుంది లీనా. ఎనిమిది రోజుల తన ప్యారిస్ పర్యటనలో ఆనందంతో పాటు ఎన్నో మంచి అనుభూతుల్ని పోగేసుకుంది.

పురాతన డ్రెస్డెన్

జర్మనీలో డ్రెస్డెన్ ఒక పురాతన నగరం. ఎల్బ్

నదీతీరంలో ఉన్న ఈ నగరాన్ని 'ఫ్లోరెన్స్ ఆఫ్ ఎల్బ్' అని కూడా పిలుస్తారు. మధ్య యుగపు యూరప్ కట్టడాలకి అద్దంపడుతుందీ డ్రెస్డెన్ ప్రాంతం. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో దెబ్బతిన్న ఈ నగరపు పురాతన కట్టడాల ఉనికి కోల్పోకుండా ఇటాలియన్ ఆర్కిటెక్చర్ 'నియో రినైసెన్స్' (పునరుజ్జీవన తర్వాత) ఆకృతుల్లో ఈ నగరాన్ని పునర్నిర్మించారు. 400 ఏళ్లనాటి రాజకుటుంబీకులు నివసించిన ప్రదేశం డ్రెస్డెన్ కేజిల్ (కోట భవంతి). నగరంలో అతి పురాతన భవనం కూడా ఇదే కావడంతో ఇక్కడికి సందర్శకులు కూడా ఎక్కువగా వస్తుంటారు. 18వ శతాబ్దంనాటి రోకోకోస్టైల్ నిర్మాణాలకి అద్దం పడుతుంది డ్రెస్డెన్'జింగర్'. ప్రేమను వ్యక్తం చేసే ఈ నిర్మాణాలతో పాటు నగర చరిత్రని చాటిచెప్పే కట్టడాలన్నిటినీ చూడడానికి ఒంటరిగా చేరుకుంది లీనా.

డ్రెస్డెన్ తర్వాత లీనాని ఆకట్టుకున్న నగరం బ్రసెల్స్. అణువు ఆకృతిలో అల్యూమినియమ్‌తో తయారుచేసిన 59 అడుగుల పెద్ద టవర్ అటామియమ్. అటామియమ్ కింది భాగంలో యూరప్ నగరాన్ని తలపించే ఎన్నో కట్టడాలున్న మినీ యూరప్ మినియేచర్ పార్క్‌తో పాటు రాయల్ మ్యూజియమ్, మ్యూజియం ఆఫ్ ది సిటీ, గ్రోటె మార్కెట్ లీనాని ఆకట్టుకున్నాయి. బ్రసెల్స్ మార్కెట్‌లో లభించే రకరకాల పళ్లు, బెల్జియన్ చాక్లెట్స్, వాఫ్లెర్స్, ఫ్రైటెట్స్ అక్కడి ప్రత్యేక రుచులే కాదు తక్కువ ధరలో లభించే ఆహారం కూడా. అక్కడి నుండి లీనా ప్రయాణం ఇటలీ దిశగా సాగింది. ఫోటోగ్రఫీలో లీనా ఎక్స్‌పర్ట్. ఇటలీలో వివిధ రెస్టారెంట్‌లు రోమన్ కట్టడాలని తన





కెమేరాలో బంధించింది. ఇటలీలో లీనా క్యాప్చర్ చేసిన చిత్రాలు నైస్‌ఫోటో(ప్రపంచవ్యాప్తంగా అమెచ్యూర్ ఫొటోగ్రఫీపై నిర్వహించే ఫోటో ప్రదర్శన వేడుకల్లో) ఉత్తమ చిత్రాలుగా ప్రదర్శించబడ్డాయి. తనకెంతో గుర్తింపునిచ్చిన ఆ కెమేరా స్వీడన్‌లో మిస్సయ్యింది. ఒక్కో ప్రదేశంలో ఒక్కో అనుభవంతో సాగిపోతూ నెదర్లాండ్స్, నార్వే, పోలాండ్, స్పెయిన్, స్వీడన్, వాటికన్ సిటీ, కోస్టారికా, ఆస్ట్రియా, బెల్జియం, క్రొయేషియా, చెక్ రిపబ్లిక్, డెన్మార్క్ ఇలా అన్నిటినీ ఒంటరిగానే పర్యటించింది. అమెరికా, కెనడా, మెక్సికో దేశాల్లో తన మిత్రులు, బంధువుల ఇళ్లలోనే ఉంటూ వివిధ ప్రదేశాల్ని చూసొచ్చేది లీనా. రాత్రి పూట సాగే బస్, రైలు ప్రయాణాలతో తన స్టేయింగ్ ఖర్చును తగ్గించుకోవడంతో పాటు కుదిరినప్పుడల్లా తనే వండుకుంటూ మరింత ఖర్చుని తగ్గించుకునే ప్రయత్నం చేసింది. థాయ్‌ల్యాండ్ వంటి దేశాల్లో పిల్లలకి స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పించడం ద్వారా కొంత డబ్బు పోగుచేసింది లీనా. అవి ఓస్లో ద్వీపాలకి చేరుకోడానికి ఉపయోగపడ్డాయి.

ముట్టుకుంటే ముప్పే

మలేషియాలోని టియోమెన్ ద్వీపంలో స్కూబా డైవింగ్‌తో పాటు సముద్రజీవులతో ఎదురయ్యే ప్రమాదాల్ని చవిచూసింది లీనా. సముద్ర జీవాల్లో కొన్ని రకాల జెల్లీఫిష్‌లు అత్యంత ప్రమాదకరంగా ఉంటాయి. వాటి ప్రమాదాల నుండి తప్పించుకోవాలంటే నీటిలో ఉండే పొదల్ని, చేపల్ని ముట్టుకునే ప్రయత్నం అస్సలు చేయకూడదు. ప్రమాదాల నుండి బైట పడాలంటే స్కూబా డైవింగ్‌కి ముందు ఇచ్చే సూచనల్ని తప్పకుండా పాటించాలంటారు లీనా. టూర్‌లో ప్రమాదాలకి గురైతే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో 'మిస్ వాకింగ్‌షూస్' బ్లాగ్ ద్వారా తెలియజేస్తున్నారు.

ఇండియా-మయన్మార్-థాయ్‌ల్యాండ్

ఆగ్నేయాసియాలోని సింగపూర్, మయన్మార్ దేశాల్లో రోడ్డు ప్రయాణాలు బ్యాక్ ప్యాకర్స్‌కి అనుకూలంగా ఉంటాయి. తన 'రౌండ్ ది వరల్డ్' టూర్‌లో భాగంగా లావోస్ , థాయ్‌ల్యాండ్, వియత్నాం, ఫిలిప్పీన్స్ వంటిదేశాలకి రోడ్ టూర్ చేయాలనుకుంది. భారత్ నుండి మయన్మార్ వంటి దేశాలకి చేరుకోడానికి విమానయానం తప్ప మరే ఇతర మార్గాలూ లేవు. అయితే ఐఎమ్‌టి(ఇండియా, మయన్మార్, థాయ్‌ల్యాండ్) క్యారిడార్ రోడ్డు మార్గం అమల్లోకి వస్తే తనలాంటి బ్యాక్ ప్యాకర్‌లు తక్కువ ఖర్చుతో ఎక్కువ దేశాల్ని చుట్టొచ్చే అవకాశముందంటారు లీనా. ఆగ్నేయ ఆసియాలో థాయ్‌ల్యాండ్‌తో టూర్‌ని ప్రారంభించినా ఫిఫి, క్రాబి, ఆయుథాయ. వంటి ఎన్నో చిన్న ప్రాంతాలు లీనా టూర్‌లో భాగమయ్యాయి. టూర్ ముగిసే సమయానికి లీనా చేరుకున్న చివరి దేశం నేపాల్. 2015లో నేపాల్‌లో చోటుచేసుకున్న భూకంపం కారణంగా అక్కడ జనజీవనం ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కోవాల్సి వచ్చింది. భూకంపం కారణంగా టూరిస్టుల్లో ఇంకా భయం ఛాయలు కనిపిస్తున్నా నిజానికి అక్కడ సాధారణ పరిస్థితులే ఉన్నాయి. నేపాల్ నగర ప్రజల పట్టుదలతో చిన్నాభిన్నమైన నగరాన్ని తిరిగి నిర్మించుకోగలిగారు. నేపాల్ ప్రభుత్వం ఇప్పటికే 6 పర్యాటక ప్రదేశాల్లో సందర్శనలకు అనుమతించింది. లీనా ఈ ప్రదేశాలన్నిటినీ సందర్శించడంతో పాటు టూరిస్టుల్లో అపోహల్ని దూరం చేసేందుకు అక్కడి పరిసరాల్ని తన కెమేరాలో బంధించి బ్లాగ్‌లో పొందుపరిచింది. 'రౌండ్ ది వరల్డ్ టూర్'ని ఒంటరిగా 17 నెలల్లో. 14.14లక్షల ఖర్చుతో పూర్తిచేసింది లీనా. మినిమల్ బడ్జెట్‌తో తను ప్రయాణించిన దూరం 79,827కి.మీ అంటే భూమిని రెండు సార్లు చుట్టబెట్టే దూరానికి సమానం. తన ట్రావెల్ అనుభవాలతో వివిధ దేశాలకి యాత్ర చేయాలనుకునే వారికి సూచనలిస్తూ ట్రావెల్ బ్లాగర్‌గా పనిచేస్తున్నారు లీనా.

- అద్దేపల్లి శర్వాణి

ప్రయాణంలో పదనిసలు

కచ్చురం బండ్లో
వడ్రంగి తడకలతో కప్పబడి
సహజ రంగులతో అద్దబడి
రామలక్ష్మణుల్లాంటి ఎడ్లను గట్టి
డొంక దారుల్లో
ఎగుడు దిగుడు తోవల్లో
వాగుల్లో ఏట్లో
చెరువు గట్లపై
పయనం ఎంత దూరమైనా
ఎంత కాలమైనా
ఎడ్ల గంటల సంగీత ఝరిలో
మైమరచి సాగే యాత్ర
మధురం
మదిలో నిలిచే జ్ఞాపకం

ఏదీ నా మంచం

నులక మంచం
నులక అల్లిక
నైపుణ్యం ఏదీ
జోలైన మంచం
కాళ్ళ కట్ట లాగి
ముడేసిన మంచం
ఎత్తి వాల్చుకునే మంచం
ఎక్కడంటే అక్కడికి
తీసుకెళ్లే
వీలు గల మంచం
డబుల్ కాట్‌లతో
గదులు ఇరుకు
ఏం మంచాలో ఏమో ఏస్తే
తీయలేం
రోజు ఒకే జాగాలో నిద్ర
నిదుర చోటు మార్చుకోలేం
మార్పులేదు
అదే చోటు అదే పడక
నిద్ర కూడా
యాంత్రికమే

- గిరిప్రసాద్ చెలమల్లు
9493388201

కవిత్వం



ఒక ఇల్లు...

అవే నాలుగు స్తంభాలూ
ఓ మూల పుస్తకాల గుట్ట కొండంత!
చలనం లేదు, అదో నల్ల దుప్పటి కప్పుకున్న
నిద్రలా ఉంది.
నిప్పుల కాగడా లాంటి వాడు మాత్రం
కొండ గుహల్లోని మెలకువ శబ్దాల్ని నాల్గు
దిక్కుల్లోకి విసురుతున్నాడు!

అక్కడో పక్క మాటల గారడీ
నిలకడ లేదు
అదో బూరా ఊదుతున్న పాములాళ్ళ
విన్యాసంలా ఉంది.
నిటారైన పటకారు లాంటి వాడు మాత్రం
పాములు చేరిన పుట్టల్లోకి తిరిగి చీమల్ని
పునరావాసం చేయిస్తున్నాడు

మరో మూల రూళ్ళ కర్రల మూక, కనికరం
లేదు,
రాజ్యం సేవలో సమాధుల్లా పాతుకుపోయిన
శాసనాల గుంపులా ఉంది.
వర్తమానానికి కొత్త నిబంధనలాంటి వాడు
మాత్రం
కాళ్ళరిగిపోతున్న బాధల్ని కనుగొనేందుకో
దారికి దిక్సూచి వేయిస్తున్నాడు

నీ నా గురించి ఆ ప్రకటనంతా నిజంలేదు
అది క్షణానికో రంగూ రుచీ వాసనలేస్తున్న
వర్తకంలోని వస్తువులా ఉంది.
పెన్ను పాళీ లాంటి మొనదేలిన వాడు
మాత్రం
వంకర్లు పోతున్న ఓ నాలుగు అక్షరాలకి
ఒడుపుగా నిఖార్సైన నాటు వైద్యం
చేయిస్తున్నాడు

పై కప్పు లేని ఆకాశమంత ఆ పెద్ద
ఇంటికిప్పటికీ
నాలుగు స్తంభాలే పునాది!!

వాటిపై ఒక్కో పెంకూ పేర్చేందుకో
పిల్లాడు మాత్రం
కాళ్ళక్కజ్జెలు కట్టుకుని ఎర్ర జెండాలా
ఎగురుతున్నాడు
అక్కడ ఏ కలల రూపం కోసమో కట్టుబడి
పనిముట్టొకటి తయారవుతోంది!

ఆచ్ఛాదన లేని నగ్న దేహమో గుడ్డుముక్క
కోసం వెతుకుతున్నట్టు
బిగదీసుకుపోయిన ఊపిరి కోసం వాడు
పల్చటి గాలిదొక్కో ముడీ తేలిగ్గా
విడదీస్తున్నాడు!
ఆ ఇల్లు వాడికిప్పుడో అస్తిత్వ వేదన

- శ్రీరామ్
9963482597



గోదారి తీరంలో సీతమ్మ చెట్టు

ఇటీవల రాజమండ్రిలో జరిగిన రాష్ట్ర ప్రభుత్వ నంది నాటకోత్సవాల్లో 'డొక్కా సీతమ్మ' నాటకానికి బంగారు నంది వచ్చింది. తూర్పు గోదావరి జిల్లా కోనసీమ అక్విడెక్టుకు డొక్కా సీతమ్మ పేరు పెట్టారు. పూర్వం అన్నపూర్ణ కావిడితో వచ్చే భిక్ష గాళ్ళు వాకిట్లోకొచ్చి 'తల్లీ డొక్కా సీతమ్మ తల్లీ భిక్షాందేహి' ఉలవపాడు కోటమ్మ తల్లీ భిక్షాందేహి... అని అరవటం చాలామందికి గుర్తు ఉంటుంది. ఇవన్నీ గమనించినప్పుడు ఈ సీతమ్మ, కోటమ్మలు ఎవరో తెలుసుకోవాలనే కుతూహలం కలగటం సహజం.

ఉలవపాడు కోటమ్మ ప్రకాశం జిల్లా కందుకూరు తాలూకాలోని పెద్ద గ్రామమైన ఉలవపాడుకు చెందిన సంపన్నురాలు. కరువు కాలమంతా ఉలవపాడులో గంజి కేంద్రం నడిపిన దానశీలి. ఇక డొక్కా సీతమ్మ గొప్ప అన్నదాత. 1842 అక్టోబర్‌లో తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురం తాలూకా మండపేటలో భవాని శంకరం, నరసమ్మ దంపతులకు జన్మించారు. భవాని శంకరం గారిని "బువ్వన్న" అని పిలిచేవారు. అన్నార్తులకు బువ్వ (అన్నం) పెట్టడమే అలా పిలవటానికి కారణం.

ఆనాటి కాల పరిస్థితుల కారణంగా సీతమ్మ చదువుకో లేకపోయినా తండ్రి ద్వారా సంక్రమించిన దానశీలత వచ్చింది. చిన్నతనంలోనే తల్లి మరణించటంతో ఇంటి బాధ్యతంతా మోస్తూనే.. ఇంటికి వచ్చే జనానికి అతిథి మర్యాదలు చేయటంలో పేరు పొందింది. గోదావరి లంక గ్రామాల్లోని గన్నవరానికి చెందిన డొక్కా భోగన్న పంతులనే పెద్ద ధనవంతుడు పని మీద మండపేటకు వచ్చి భోజన సమయానికి బువ్వన్న గుర్తొచ్చి వారింటికి వచ్చాడు. సీతమ్మ అణుకువ, ఆదరణ, కార్యదక్షతకు ముగ్ధుడై భవాని శంకరం సమ్మతితో ఆమెను వివాహం చేసుకున్నాడు. ఆ రకంగా ఈ అన్నపూర్ణ లంక గన్నవరం కోడలైంది. సంపన్నమైన మెట్టినిల్లు ఆమె దానశీలతకు మరింత వన్నె తెచ్చింది. కాలక్రమంలో జోగన్న మరణించినా భర్త మరణానికి బాధ్యత వహించే మిగతా బ్రాహ్మణ మహిళల్లా ఇంటికి బంధీ కావటానికి ఆమె నిరాకరించి అన్నార్తులకు దీనులకు దయామయురాలిగా వెలుగొందటమే గాక ఇతరుల శుభకార్యాలకు సాయం చేయటం, మంచి నీటి బావులు తవ్వించటం, భూదాన, గృహదానాలు చేయటమే గాక ఇప్పుడు హరితవనంలా వెలుగొందుతున్న కోనసీమలో తొలిసారి ఫల, పుష్ప మొక్కలను నాటింది సీతమ్మే. ఆ కాలంలోనే కాటన్ దొర ధవళేశ్వరం ఆనకట్ట కూడా నిర్మించారు. 1841లో పుట్టి 1909లో చనిపోయిన ఈ స్త్రీమూర్తి జీవిత విశేషాల్ని సేకరించటానికి ప్రఖ్యాత చరిత్ర పరిశోధకులు వకుళాభరణ రామకృష్ణ ప్రయత్నం చేసినా అది సాధ్యం కాలేదు. సాహిత్య ఆధారాలు లేవు. అలేఖ్య సమాచారం లేదు. ఆ తరం మనుషులు లేరు. మహా సాధ్వి, అన్నపూర్ణ తల్లి లాంటి పొగడ్తలు తప్ప తగు సమాచారం చెప్పేవారు లేరు. 125 సంవత్సరాల క్రితం చరిత్ర సేకరణకు మనదేశంలో పరిస్థితి ఇది.

కులం, మతం, పేద, సాద వివక్షణ లేకుండా వచ్చిన వారందరికీ అర్ధరాత్రి, అపరాత్రి అనుకోకుండా అన్నం పెట్టటమే జీవితంగా ఆమె జీవిత కాలమంతా గడిపింది. జీవిత చరమాంకంలో కాశీలో చనిపోవాలని ఒక ఎడ్లబండిని మాట్లాడుకొని ప్రయాణం ప్రారంభించింది. విపరీతమైన ఎండలో, రాళ్ళ రప్పలతో నిండిన దారిలో తీవ్ర అసౌకర్య ప్రయాణంలో మొదటి రోజు ఒక సత్రంలో మజిలీ చేసింది. పక్క గదిలో చిన్నపిల్ల ఏడుపు విని మేలుకొంది. ఆకలై అన్నం కోసం ఏడుస్తున్న పిల్ల ఆమెను సముదాయిస్తున్న తండ్రి మాటలు వినపడ్డాయి. 'కొన్ని గంటలు ఓర్చుకోమ్మా. పొద్దునే మనం గన్నవరం గ్రామం వెళ్లి డొక్కా సీతమ్మ తల్లి ఆతిథ్యం తీసుకుందాం. నీకు కడుపు నిండా అన్నం దొరుకుతుంది.' అని ఓదారుస్తున్నాడు.

ఈ సంభాషణ విన్న సీతమ్మ అర్ధరాత్రి బండివాణ్ణి లేపి తిరిగి గన్నవరానికి ప్రయాణమై వెళ్ళి ఆ కుటుంబం వచ్చే సమయానికి భోజనం చేసి వుంచింది. ఊరు ఏదైనా ఆమె అన్నదాత తత్పరత తెలియజేయటానికి ఇది ఒక దృష్టాంతం. గోదావరికి వరదలొచ్చిన సమయంలో నది అవతలి వైపు చిక్కుకున్న ఒక పొలం కాపలాదారు అర్ధరాత్రి ఆకలితో 'సీతమ్మ తల్లీ! ఆకలి' అని అరుస్తుంటే నిద్రలో వున్న భర్తను లేపి అన్నం మూటకట్టి పొడిగుడ్డలు, చుట్టలు ఇచ్చి పడవ సరంగును సాయంగా పంపి ఆ కాపలాదారు ఆకలి తీర్చింది.

ప్రచార ప్రసార మాధ్యమాలు లేని రోజుల్లోనే ఆమె దానశీలత గూర్చి దశదిశలా వ్యాపించి బ్రిటీషు ప్రభుత్వాన్ని చేరింది. ఆమెను సన్మానించడానికి రాజధానికి రమ్మని 1903 జనవరి1వ తేదిన జరిగే ఎడ్వర్డు రాజు పట్టాభిషేక వార్షికోత్సవానికి ఆహ్వానం పంపారు. రాజధానికి వెళితే ఆ కొద్ది రోజులూ అన్నార్తులకు ఆకలెవరు తీరుస్తారనే మీమాంసతో ఆమె వెళ్లలేదు. ప్రభుత్వమే పతకాన్ని, ప్రశంసా పత్రాన్ని జిల్లా కలెక్టరుకి పంపి గన్నవరం గ్రామం వెళ్ళి వాటిని సీతమ్మకు అందజేయవలసిందిగా ఆదేశించగా 1903లో గన్నవరంలో సభ జరిపి ఆమెకు అందజేశారు. కలెక్టరు ద్వారా ఆమె ఛాయా చిత్రాన్ని తెప్పించుకుని చక్రవర్తి తన దగ్గరుంచుకున్నట్లు తెలుస్తుంది.

ఈమె వదాన్యతను విన్న పిఠాపురం రాజా గారు తన దివాన్‌తో కలిసి మారువేషాల్లో వచ్చి సీతమ్మ ఆతిథ్యం స్వీకరించి ఒక గ్రామాన్ని ఆమెకు బహూకరించటానికి నిర్ణయించుకోగా ఆ దానాన్ని ఆమె స్వీకరించలేదు. చివరకు 1909 లో ఆమె చనిపోయిన తర్వాత ఆమె కొడుకు సుబ్బారాయుడిని ఒప్పించి నలభై ఎకరాల భూమికి పట్టా రాసిచ్చాడు. అంతేకాక ప్రతి సంవత్సరం దసరా రోజు పంచలచాపు బహుమతి కింద 365 రూపాయలు పంపించేవారు.

- చెరుకూరి సత్యనారాయణ



సుమారు 45 లక్షల మంది సెక్స్ ట్రాఫికింగ్ బాధితులే. పేద దేశాల నుంచి చిన్నారుల్ని, మహిళల్ని పోర్న్ ఇండస్ట్రీలు, వ్యభిచార పర్యాటక కేంద్రాలుగా ఉన్న దేశాలకు అక్రమంగా తరలిస్తున్నారు.

కేవలం సెక్స్ ఇండస్ట్రీలోనే కాదు వ్యవసాయం, పరిశ్రమలు, గనుల్లో బానిస కూలీలుగా ఉపయోగిస్తున్నారు. వీరికి జీతభత్యాలు, సదుపాయాలు, కుటుంబాల వంటివేవి ఉండవు. బతికున్నంత వరకు బలవంతంగా పనిచేస్తూనే ఉండాలి.

విదేశాల్లో మోడల్స్‌గా, ఆతిథ్య రంగ ఉద్యోగులుగా, ఇంటి పనివారిగా మహిళలకు పని కల్పిస్తామంటూ పలు కంపెనీలు, ఏజెన్సీలు ఇచ్చే అడ్వర్టైజ్‌మెంట్లతో చాలా జాగ్రత్తగా ఉండాలనేది పలు స్వచ్ఛంద సంస్థల సూచన. సరైన వీసాలు లేకుండా విదేశాలకు రప్పించి ఇమ్మిగ్రేషన్ చట్టాల్ని బూచిగా చూపి మహిళల్ని సెక్స్ ట్రేడ్‌లోకి నెడుతున్నారు.



ఆసియా, మధ్య, ఆగ్నేయ, పశ్చిమ యూరప్‌ల నుంచి ఎక్కువగా హ్యూమన్ ట్రాఫికింగ్ ఉంటోంది.

హ్యూమన్ ట్రాఫికింగ్ పాల్పడే వారే మత్తు పదార్థాలు, మారణాయుధాల అక్రమ రవాణానూ చేస్తుంటారు.

గత పదేళ్లలో నేపాల్ నుంచి రెండు లక్షల మంది బాలికల్ని (9 ఏళ్ల వయస్సు వారి నుంచి) భారత్‌లోని రెడ్‌లైట్ ప్రాంతాలకు అక్రమంగా తరలించారని లెక్క.

ఓ దేశం నుంచి మరో దేశానికి అక్రమంగా తరలిస్తున్న మహిళలు, పిల్లల సంఖ్య ఏటా 8 లక్షల మందికి పైగానే. ఒకే దేశంలోని వివిధ ప్రాంతాలకు అక్రమ రవాణా కాబడుతున్న వారి సంఖ్య ఇంకా ఎక్కువే.

ప్రపంచ వ్యాప్తంగా రెండున్నర కోట్ల మందికి పైగా మహిళలు, కోటిన్నర మంది పిల్లలు మానవ అక్రమ రవాణాకు గురై ఉంటారని నివేదికలు. వీరిలో ఎక్కువ మంది (75-80 శాతం) వ్యభిచార కూపంలోకి బలవంతంగా నెట్టబడినవారేనని, మిగతా వారు అతి ప్రమాదకర, ఏహ్యకర వృత్తుల్లోకి లాగబడినవారని అంతర్జాతీయ సంస్థ.

పోర్నోగ్రఫీ వీడియోల్ని ఉచితంగా అందుబాటులో ఉంచి ఎక్కువ మందిని ఆకర్షిస్తున్నారు. వీక్షణలు, వీక్షకుల సంఖ్య పెరుగుతున్న కొద్దీ మరింత మంది బాధితుల్ని ట్రాఫికింగ్ చేస్తున్నారు. ఇది ఆగాలంటే పోర్నోగ్రఫీ చూసే అలవాటు తగ్గించుకోవాలి. డిమాండ్ తగ్గితే సప్లై తగ్గుతుంది.

ఇంటర్‌నెట్ వల్ల సెక్స్ ట్రాఫికింగ్ సమస్య పరాకాష్ఠకు చేరుకుంది. ట్రాఫికర్ల పని తేలికైంది. వ్యక్తుల పేర్లతో వచ్చే యాడ్‌లలో ఎక్కువ శాతం ట్రాఫికర్లు నిర్వహిస్తున్నవే. ఏ దేశం, ప్రాంతం, జాతి, వయస్సు, శరీరాకృతి వారికి ఎక్కువగా నెటిజెన్లు ఆకర్షితులవుతున్నారో తెలుసుకుని ఆయా దేశాల నుంచి వ్యక్తుల్ని అక్రమంగా వ్యభిచార కూపాలకు తరలిస్తున్నారు.

హ్యూమన్ ట్రాఫికింగ్ మీదుగా ఏటా రెండు లక్షల కోట్ల రూపాయల అక్రమ వ్యాపారం జరుగుతోందని లెక్కలు.

బాధితులకు హెచ్‌ఐవీ వంటి ప్రాణాంతక వ్యాధులు సంక్రమిస్తూ వారి బతుకుల్ని మరింత ఛిద్రం చేస్తున్నాయి. వ్యాధులకు గురైన వారిని పట్టించుకోరు. ఏటా 30 వేల మందికి పైగా చిన్న వయసులోనే మరణిస్తున్నారు. మానవ అవయవ రాకెట్‌కు కూడా వీరు బలైపోతున్నారు.

(జూలై 30న International Day Against Trafficking In Persons సందర్భంగా..)

కబేళా

- మాదా. ఆంజనేయులు
9440581463

అమ్మాయమ్మకు ఛాతీలో నొప్పితో పాటు వళ్లంతా చెమటలు పట్టసాగాయి. తనకేదో అవుతుందని భయమేసి, మంచంపై నుంచి అతి కష్టం మీద పైకి లేవబోయింది. సాధ్యం కాలేదు. బాధను పళ్ల బిగువున భరిస్తూ రాకేష్ అంటూ కొడుకును పిలవబోయి బహుశా అంగటికెళ్లాడేమో అనుకొని ఆగిపోయింది. ఇంట్లో చిన్న కోడలు వంట రూమ్‌లో ఉన్నట్లు పాత్రల శబ్ధం వినవస్తుంది. తనకు నొప్పిగా ఉన్న విషయం చిన్న కోడలుకు పిలిచి చెప్పేందుకు మనసొప్పక మంచం మీదే మెలికలు తిరగసాగింది.

వారం రోజుల క్రితం అమ్మాయమ్మకు బి.పి పెరిగి, నడుస్తున్నదల్లా కుప్పకూలిపోవడంతో ఆసుపత్రిలో చేర్పించారు. చిన్న కోడలు సణుక్కుంటూనే సపర్యలు చేసింది. ఆరోగ్యం మెరుగవడంతో నిన్ననే డిస్చార్జ్ అయి ఇంటికి తీసుకొచ్చారు. ఇప్పుడు మళ్లీ నొప్పి అని చెప్తే కోడలు చూపుల్లోని కోపంతో కూడిన ఆసహ్యాన్ని చూడదల్చుకోలేదు అమ్మాయమ్మ. కాని నొప్పిని భరించలేక పోవడంతో పాటు తను చచ్చిపోతానేమోనన్న భయం ఎక్కువ కావడంతో కోడల్ని పిలిచింది. రెండు సార్లు పిలిచిన తరువాత విసుగ్గా వచ్చిన కోడలి ముఖం చూసి "కొద్దిగా వేడి నీళ్ల తెచ్చిస్తావా" అంది. అప్పుడైనా ఏమైందని అడుగుతుందని అప్పుడు చెప్పవచ్చుని. కాని ఆమె అంచనా తప్పైంది. కోడలు మరేమి మాట్లాడకుండా వంట గదిలోకి వెళ్లిపోవడంతో చిన్నగా మూల్గుతూ నొప్పిని భరిస్తూ ఓ పక్కకు ఒరిగి పడుకొంది. కొద్దిసేపటికి నొప్పికి ఆమె మీద జాలేసిందేమో దానంతటకు అదే తగ్గిపోయింది. శరీరమంతా నిస్సత్తువ ఆవరించింది. శారీరక బాధ తగ్గిందే కాని నిస్సత్తువతో పాటు మనసులో గూడు కట్టుకొన్న బాధతో ఆమె అచేతనంగా శూన్యంలోకి చూస్తుండి పోయింది. దాదాపు ఇరవై సంవత్సరాల క్రితం మంచానికే పరిమితమై చావు బతుకుల్లోనున్న భర్త కడసారి మాటలు చెవుల్లో గింగురు మనసాగాయి.

"చూడు అమ్మulu నాకు రోజులు దగ్గర పడ్డాయన్పిస్తుంది. నేను మంచం మీద బతికి మీకు భారంగా ఉండాలన్పించటం లేదు. ఉపయోగం లేనప్పుడు వస్తువుకైనా, మనిషికైనా మునుపటి విలువ ఎప్పటిలాగా ఉంటుందనుకోవడం భ్రమ. నా మాటలు నీకు కటువుగా అనిపిస్తున్నా నిజమదే అమ్ములు. నేను చచ్చిపోతే నీకు ఫించనొస్తుంది. అది నీకు చివరి రోజుల్లో నీ కొడుకులు నిన్ను చూసుకొన్నా చూసుకోకపోయినా ఉపయోగపడుతుంది. నేను చచ్చిపోతే పెద్ద కొడుకుకి ఉద్యోగం ఎలాగు ఇస్తారు. చిన్నోడికి చదువు లేదు. వాడి బాగోగులు కోసం ముందుగానే కొద్ది ఆస్తి వాడి పేర రిజిస్టరు చేయిస్తా. అమ్మాయి పెళ్లి అయిపోయాక వాళ్లు ఎప్పుడు కోరుకొంటే అప్పుడు ఇద్దరికి మిగతా ఆస్తి సమానంగా పంచుతూ నీ పేర కొద్దిగా ఉంచుకో. కొడుకుల బుద్ధులు ఎప్పుడు ఎలా మారుతాయో! ఆస్తి ఉంటే నువ్వు భారంగా అన్పించినా ఆ భారం

మోసినందుకు ప్రతిఫలం కోసమైనా నీ రోజులు సుఖంగా గడుస్తాయి"

భర్త చెప్పిన మాటలు ఆమెకప్పుడు విడ్డూరంగా అన్పించాయి. అతను చనిపోయాక అమ్మాయమ్మ ధైర్యం కూడగట్టుకొని సంసారాన్ని నెగ్గుకొస్తూ ఇద్దరు కొడుకులు, కూతురి దగ్గర ఉంటూ కాలం వెళ్లబుచ్చుసాగింది. ఎవరి దగ్గరుంటే ఆ సమయంలో ఆమెకు ఫించను డబ్బులు వాళ్లకే ఇచ్చేది. అమ్మాయమ్మకు ఆరోగ్యం బాగా ఉన్నప్పుడు ఆమె ఫించను డబ్బులతో పాటు ఉచితంగా పని మనిషి దొరికినట్లన్పించి ఆమె తమింటికి ఎప్పుడెప్పుడు వస్తుందా ఎదురు చూసేవాళ్లు. ఫోన్ల మీద ఫోన్లు చేసి వాళ్ల ఇళ్లకు పిలుచుకపోయేవారు. అమ్మాయమ్మ అది నిజమైన ప్రేమ అని మురిసిపోయేది. తన భర్త చివరి మాటలు ఆమెకు నవ్వు తెప్పించేవి. తన కొడుకులు కోడళ్లు అందరి లాంటి వాళ్లలా కాదని మురిసిపోతూ... మనవళ్లతో మనవరాళ్లతో హాయిగా రోజులు గడిచిపోయే సమయంలో... పెద్దోడు తనకు పిల్లనిచ్చిన మేనమామ మాటలు విని ఆస్తి పంపకాలు చేయమని పోరు పెట్టి చిన్నవాడికి రిజిస్టరు చేసిన ఆస్తిలో కూడా వాటా అడగడంతో సమస్యలు మొదలయ్యాయి. చిన్న వాడు చదువులేక పోయినా తెలివిగా చిన్న చిన్న వ్యాపారాలు చేస్తూ పెద్దవాడి కన్నా ఎక్కువ సంపాదన పరుడైయ్యాడు. చిన్నోడి పరిస్థితి పెద్దోడికన్నా మెరుగ్గా ఉంది కాబట్టి ఆ ఆస్తిలో కూడ భాగాలు పంచాలని వాడి మేనమామ వాదన. నాన్న రిజిస్టరు చేసింది ఎందుకు పంచాలని చిన్న కొడుకు వాళ్ల తరుపున వాదన. కరవమంటే కప్పకు కోపం. విడవమంటే పాముకు కోపంలా తయారైంది. అలాంటి పరిస్థితిలో భర్త చెప్పిన మాటలు కూడ పెడచెవిని పెట్టి తన కోసం ఏమి పెట్టకోకుండా ఇద్దరికి సమానంగా పంచేసింది. బి.పి, షుగర్ వంటివి గుల్ల చేస్తుండటంతో పాటు వయసుపై బడటంతో పనిచేయలేని స్థితికి రావడంతో వాళ్ల బుద్ధులు బైటపడసాగాయి. తన రాక కోసం ఒకప్పుడు ఎదరు చూస్తూ పరుగుపరుగున వచ్చి పిల్చుక పోయే వాళ్లు ఇంట్లో ఉంచుకొనేందుకు కుంటి సాకులు చెప్పుండటంతో తనే చెరి ఆరు నెలలు ఒక్కొక్కరి దగ్గరుంటు కాలం గడుపుతుంది. గత రెండు వారాల నుంచి ఆమె పరిస్థితి మరీ దిగజారి పోయింది.

> **... అని కొద్దిసేపాగి "పాపమది ఆఖర్న కబేళకెళ్తూ సస్తూ కూడ మాకు పైసలు ముట్ట చెప్పి పోయినాది. దాంతో వాడేం మిద్దెలు కట్టిస్తాడా? రాజ భోగాలేల్తాడా?" అంటూ కన్నీళ్లు పెట్టుకోసాగింది.**

హాల్లో మాట్లాడుతున్న శబ్దానికి మెలకువ వచ్చింది. అమ్మాయమ్మకు కొడుకు మాటలు స్పష్టంగా వినిపిస్తున్నాయి. తన దగ్గరికి వచ్చి ఎలా ఉందమ్మా అని అడిగితే ఛాతీ నొప్పి గురించి చెప్పాలనుకొని ఎదురుచూడసాగింది. కాని రాకేష్ ఫోంచేసి కొద్దిసేపు విశ్రాంతి తీసుకొని మళ్లీ అంగడికిపోతూ అప్పుడు గుర్తుకొచ్చిన వాడిలా

"ఎలా ఉంది ముసలామెకు... ఏమైనా తిందా" అడిగాడు భార్యను. తనని ముసలామె అని అంటున్న కొడుకు మాటలకు శూలాలతో వళ్లంతా తూట్లు పొడిచినట్లు అన్పించి కంట్లో నీళ్లు ఆమె ప్రమేయం లేకుండానే పక్కను తడపసాగాయి.

"బాగానే ఉందిలెండి. మన ఖర్మ ఇక్కడికి రాగానే మాయదారి రోగాలన్ని వచ్చి పడ్డాయి. ముసల్దానికి చాకిరీలు చేయలేక చస్తున్నా. ఏం చేద్దాం మీ అన్న దగ్గరున్నప్పుడు ఒక్క జబ్బురాదు. రాయిల్లా తిని తిరిగి వెట్టి చాకీరిలు చేస్తుంది"

"నువ్వు చాకీరిల గురించి ఆలోచిస్తున్నావ్. నా జేబులు చిల్లు గురించి ఆలోచిస్తుంటే నాకు దిమ్మ తిరిగి పోతుంది. ఆర్నెళ్ల నుంచి ఆమె ఫించను డబ్బు పైసా మిగలక పోగా వేలకు వేలు ఖర్చై పోతున్నాయి."

"ఇంకెన్ని రోజులో వారం రోజులకు నెల అయిపోతుంది. మీ అన్నకు ముందుగానే చెప్పండి లేదంటే ఆఫీసుకు శెలవు దొరకలేదని మళ్ళీ ఓ వారం పాటు మన నెత్తినే ఉంచుతాడామెను."

"వాడో వెధవ! ఎప్పుడు తప్పించుకోవాలా అని ఎదురు చూస్తుంటాడు. అయినా ఆ ముసిల్దానికి వాడంటేనే ఇష్టం."

"మరి లేకపోతే మీ అన్న మీకు మీ నాన్న రాసిచ్చిపోయిన ఆస్తి కోసం అంతలా కొట్లాడుతుంటే నోరు విప్పిందీ. అందుకే ఆమంటేనే నాకు అసహ్యం. దేవుడి దయ వల్ల ఆదివారం వరకు ముసల్ది ఆసుపత్రి పని పెట్టకుంటే చాలు ఆ తరువాత ఆర్నెల్ల వరకు ఈ తిప్పలుండవు మనకు..."

ఇలాంటి మాటలు వినాల్సి వస్తుందనేమో దేవుడు ముసిలోళ్లకు చెవుడు, కంటి చూపు మందగించేటట్లు చేస్తున్నాడు. తనకు అవి వచ్చి ఉంటే వాళ్లు ఏం మాట్లాడుకొంటున్నా, ఎలా చూసిన అంత బాధ ఉండేది కాదు అనుకొంటూ ఆ తరువాత ఇంకేమి వినాల్సి వస్తుందోనని గట్టిగా చెవులు మూసుకొంది అమ్మాయమ్మ.

తనకు బాగోలేదని ఫోన్ చేసిన రెండు రోజులకు కూతురు చూడటానికి రావడంతో గుండెల్లో అణుచుకొన్న దుఃఖం ఒక్కసారిగా బైటికి తన్నుకొచ్చి బావురుమంది అమ్మాయమ్మ. కూతురు ఓదార్పుతో పసిపిల్లలా గువ్వలా కూతురి ఒడిలో ఒదిగిపోయింది. నీరసంగా మాట్లాడేందుకు శక్తిలేని ఆమెను చూస్తే జాలేసిన కూతురు పదేపదే అడగటంతో ఛాతీలో నొప్పి గురించి చెప్పింది.

"చిన్నోడికి చెప్పలేదా" అడిగింది కూతురు.

"లేదే ఏదో చిన్న నొప్పి కదా. అయినా వాడికి చెప్పేందుకు నోరు రావడం లేదు."

కూతురు మరేమి మాట్లాడకుండా బలవంతంగా కడప ఆసుపత్రికి తీసుకొచ్చింది. ఆసుపత్రికి వెళ్లాక అక్కడ డాక్టరు చెప్పింది విని షాక్ తింది ఆమె కూతురు. విషయం అమ్మాయమ్మకు చెప్పకుండా ముందు పెద్దోడికి ఫోన్ చేసింది. వాడుండేది కడపలోనే. "అన్నయ్య అమ్మకు ఆరోగ్యం బాగోలేదంటే ఆసుపత్రికి పిల్చుకొచ్చాను కడపకు. డాక్టరు అమ్మకు హార్ట్ స్ట్రోక్ రెండు సార్లు వచ్చింది. వెంటనే హైదరాబాదు తీసుకెళ్లమంటున్నాడు. ఒకసారి హాస్పిటల్ దగ్గరికి రారా డాక్టరుతో మాట్లేడేందుకు." అంటూ ఏడుస్తూ చెప్పింది.

"ముసల్ది చంపుక తింటుంది కదే. అయినా నువ్వెందుకు పిల్చుకొచ్చావ్? వాడున్నాడు కదా. ఆమె బాగోగులు వాడే ఇంకా వారం రోజులు చూసుకోవాలి. అయినా నేనొచ్చి చేసేదేముంది నాకు అర్జంటు పని మీద క్యాంపు పోతున్నా .. మీ వదిన కూడా ఊర్లో లేదు. ఆమెను వాడి దగ్గరికే తీసుకెళ్లు తరువాత నేనొచ్చి ఏం చేయాల్సింది ఆలోచిస్తాం" అని ఫోన్ పెట్టేశాడు.

ఆ తరువాత చిన్నోడికి ఫోన్ చేసి డాక్టరు చెప్పింది, పెద్దోడికి ఫోన్ చేస్తే దానికి వాడేమనింది చెప్పింది. దాంతో వాడు అగ్గిమీద గుగ్గిలంలా ఎగిరి పడ్డాడు. అమ్మకు ఆరోగ్యం గురించి పక్కన పెట్టి వాణ్ని నానా మాటలు ఆనడం మొదలు పెట్టి "ఏం చేస్తాం నా ఖర్మ అలా కాలిపోతుంది. నా కొంపకే తీసుకురా ఉంటే ఉంటాది పోతే పోతాది" అని ఫోన్ పెట్టేశాడు.

వాళ్ల మాటలు అమ్మ చెవిలో పడ్తే హాస్పిటల్లోనే మరోసారి గుండెపోటు వచ్చి చచ్చిపోతుందేమో అన్పించింది కూతురికి. నీరసంగా మంచం మీద పడుకొని ఉన్న ఆమెకు నిజం చెప్పే ధైర్యం చాల్లేదు. కాని కూతురు ముఖంలో భావాలని చదివినట్లు "ఏమే ఏమన్నాడు? డాక్టరు నొప్పి గుండె జబ్బు వల్ల

వచ్చిందన్నాడు జబ్బు చాలా ముదిరిందన్నాడా" అంది ఎండిపోతున్న గొంతుతో ఏమి వినాల్సివస్తుందన్న భయంతో.

"ఏమి లేదు నీరసం వల్ల అలా ఉందట మాత్రలు అవి రాసిస్తానన్నాడు. అవి తగ్గక పోతే హైదరాబాదులో చూపించుకోమన్నాడులే నువ్వేం అధైర్యపడకు. నేను డాక్టరు దగ్గరికెళ్లి మాత్రలు రాయించుకు వస్తాను. తరువాత ఇంటి కెళ్దాం." అని డాక్టరును మరోసారి జబ్బు తీవ్రతను గురించి తెలుసుకోవడానికి లోపలికెళ్లింది.

మరుసటి రోజు... ఈ మధ్య రాకపోకలు బంద్ చేసిన పెద్దోడు చిన్నోడి ఇంటికి వచ్చాడు. వాడితో పాటు వాళ్ల మేనమామ హాలు లోపల అమ్మాయమ్మ గురించి చర్చించుకొంటున్నారు. అమ్మాయమ్మ మంచం మీద ఉంది అన్న స్పృహ కూడా లేదు వాళ్లకు!

యాంజియోగ్రామ్ చేస్తేకాని వ్యాధి తీవ్రత తెలియదని దానికి ఖర్చు ఎవరు పెట్టుకోవాలి అని తర్జన భర్జన పడ్డారిద్దరు. నీదగ్గరున్నది కాబట్టి నువ్వే పెట్టుకోవాలని పెద్దోడంటే అంత ఖర్చు నేనే పెట్టుకోవాలా అని చిన్నోడు.

" నీ దగ్గరుంది కాబట్టి నువ్వే పెట్టుకోవాలి. తప్పదు కదురా చిన్నోడా. అయినా ఏం పెద్ద ఖర్చువుతుందని. ఆమెకు హెల్త్ కార్డుంది. లేకపోతే పెద్దోడిది ఉపయోగపడ్తుంది. యాంజియోగ్రామ్‌ది పెద్ద సమస్యకాదు. మీకిద్దరికి తీరిక లేకపోయినా నేనే పోయి చేపిస్తా కాని తరువాత ఏం చేయాలన్నది సమస్య జబ్బు గురించి పూర్తిగా తెలిసిన తరువాత అంటే స్టంట్ చేయించాలంటే ఎలా స్టెంట్‌కూడా నయం కాని పరిస్థితిలో ఉంటే బైపాస్ చేయించాలంటే ఏం చేయాలి అది ఆలోచించాలి కదా." పెద్దరికంగా వాళ్ల మేనమామ.

"స్టెంట్ అయినా బైపాస్ అయినా హెల్త్ కార్డున్నా చెరో లక్ష ఖర్చు కాక తప్పదు. ఇప్పుడు నా దగ్గర అంత డబ్బులేదు. ఒకవేళ ఖర్చుపెట్టి ఆపరేషన్ చేయించినా ఆమెను బెడ్ మీద ఎవరు చూసుకొంటారు" అన్నాడు పెద్దోడు.

" నా దగ్గర మాత్రం డబ్బెక్కడుంది. ఈ ఆరునెలల్లో ఆమె డబ్బు పైసా మిగలక పోగా నా చేతి నుంచి ఇంకా ఖర్చైయింది."

అమ్మకు వచ్చిన జబ్బును ఎలా నయం చేసి ఆమెను కాపాడుకోవాలన్న ఆలోచన కన్నా రాబోయే కష్టనష్టాలను గురించి తీవ్రంగా చర్చించుకొంటుంటే విసుగేసినా కూతురు "ఎందుకురా అమ్మ ఆరోగ్యం బాగోలేక చూపించకపోతే రేపో మాపో చచ్చేటట్లున్న ఆమెను పక్కన పెట్టుకొని లాభనష్టాలు కష్టనష్టాల గురించి ఆలోచించటానికి సిగ్గులేదు." అని వినిపించక పడింది ఉక్రోషంగా.

"నీకేమే చెప్తావ్ చేసే వాడికి తెలుస్తుంది. అంతగా ప్రేమ కారిపోతుంటే నీ ఇంటికి తీసుకెళ్లు" అంటూ గయ్యిమని లేచారిద్దరు అన్నదమ్ములు.

" అలాగే తీసుకెళ్తాలేరా ఆమేమి నాకు బరువు కాదు మీలాంటి చవటల్లాంటి ఇద్దరు కొడుకులు వదిలేస్తే మాత్రం నేను వదలిపెట్టానా?"

" అవును... నువ్వెందుకు తీసుకెళ్లవే తల్లీ. ఇన్ని రోజులు మేం చేసిన సేవలన్నీ మట్టికొట్టుకుపోయాయి. రేపో మాపో గుండెనొప్పితో పోయే దాన్ని తీసుకెళ్లి మంచి పేరు తెచ్చుకోవటంతో పాటు ముసల్దాని నగలు కొట్టేయాలని ఆశ కాకపోతే ప్రేమ కారిపోతుందా?" అంటూ రాగాలు తీసింది పెద్దకోడలు.

"అవును మరి ప్రేమ కారిపోదు! కింద పడిపోతే ఆసుపత్రిలో ఇంట్లో చచ్చి చెడి సేవలు చేస్తే ఇప్పుడు ప్రేమ ఒలకబోస్తూ వచ్చింది. తనింటికి తీసుకుపోతానని. ఏలాగు చస్తుంది కదా" అని అంటూ చిన్న కోడలు గొంతు కలిపింది.

అదే ధోరణిలో పెద్దోడు, చిన్నోడు కూడా ఆమె మీద విరుచుకుపడ్డారు మాటల్తో. వాళ్ల మనస్సుల్లోని కుటిలత్వం బైట పడి హీనాతి హీనంగా మాట్లాడుతుంటే కూతురు అవాక్కయింది.



మేనమామ కలగచేసుకొంటూ మేనకోడల్ని ఉద్దేశిస్తూ "చూడు అమ్మడూ నువ్వేమి బాధ పడాల్సిన పనిలేదు. మీ నాన్న పోయిన తరువాత మీ అమ్మ కష్టపడిందో సుఖపడిందో మొత్తానికి ఆమె బాధ్యతలన్ని పూర్తిచేసింది. ఆమె ఇక ఉండి చేసేదేమిలేదు. రామాకృష్ణ అనుకొంటూ కళ్లు మూయడమే మిగిలింది. అలాంటి ఆమెకు ఈ వయస్సులో అప్పుచేసి ఆపరేషన్లు చేయించటం అవసరమా? చేసినా ఈ వయస్సులో ఆమె తట్టుకొని నిలబడుతుందా? అయినా ఆమె బతికి సాధించేదేముంది. అందరికి భారం కావడం తప్ప నీ కనిపించవచ్చు మేనమామ ఇలా మాట్లాడుతున్నాడని. కాని ఆపరేషన్ జరిగిన తరువాత ఆమె పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించు ఒక వేళ ఆమె మంచానికి పరిమితమైతే ఆమెకు సేవలు చేసేదెవరు చెప్పు"

అంటే ఆమెను అలాగే వదిలేస్తారా" గొంతు పెగల్చుకొని అంది కూతురు.

సమాధానమేమి చెప్పకుండా వాళ్లంతా తన వైపు చూసిన చూపులకు వాళ్ల ఉద్దేశం ఏమిటో

బైటపడింది. ఆమెకు ఎలాంటి వైద్యం చేయించరు. తనవెంట పంపరు. ఏమి చేయాలో దిక్కుతోచక నిస్సహాయురాలై కంట్లో నీళ్లు కారుతుంటే అమ్మాయమ్మ గదిలోకి వచ్చింది ఆమె కూతురు. కాని అప్పటికే అమ్మాయమ్మ వాళ్ల మాటలు వినలేక బైటికొచ్చి వరండాలో కూర్చుని ఉంది. ఆమె చూపులు నిర్వేదంగా ఉన్నాయి. నిర్వికారంగా శూన్యంలోకి చూస్తూ కూర్చుంది. చిన్న దెబ్బ తగిలితే తనకు తగిలినట్లు వాళ్లే తను తనే వాళ్లు అన్నట్లు మమేకమై వాళ్ల కోసమే తన జీవితాన్ని ధారపోసి పెంచిపెద్దచేసిన కొడుకులు తను ఎంతో అప్యాయంగా చూసుకునే తమ్ముడు ఇప్పుడు తనను కేవలం ఓ పనికి రాని వసుతవులా భావిస్తు బైటపారేసేందుకు సిద్ధపడ్తూ మాట్లాడుతుంటే బలహీనమైన ఆమె గుండె కొన ఊపిరితో కొట్టుకొంటూ ఎప్పుడు ఆగిపోవాలా అని ఎదురుచూస్తోంది. తన భర్త అన్న చివరి మాటలు గుర్తుకొస్తుంటే.. ఆత్మీయత అనురాగాలు లేని ఈ నరకం కన్నా చావే మేలు 'దేవుడా! నన్ను త్వరగా తీసుకెళ్లు తండ్రి అని వేడుకోసాగింది. ఆమె మనసు. లోపల్నించి వచ్చి పక్కనే కూర్చుంటున్న కూతురు ఆమె నిర్వికార చూపులకు చలించి పోతూ లోపల జరిగిన సంభాషణలు ఆమె విందేమో అనుకొని ఆమెతో మాట్లాడే శక్తిలేక మౌనంగా ఉండిపోయింది. ఆ నిశబ్దాన్ని భగ్నం చేస్తూ రోజూ పాలు పోసే పాలావిడ గొణుక్కొంటా వచ్చింది. మీరే సెప్పండి అమ్మగోరు. మడిసన్నాక ఇంత మనసుండాల్నా అన్ని దాండ్లకు పైసల్లో లెక్క కడ్తే మడిసికి పశువుకు తేడా ఏముంటాది సెప్పండి...."

ఆమె ఏమంటుందో ఎవర్ని గురించి అంటుందో అర్థం కాక కాంతిలేని కళ్లతో చూస్తున్న అమ్మాయమ్మను చూస్తూ

"నా ఇంట్లో పాడి గేదె గురించమ్మా. దాన్ని పుట్టినప్పటి నుండి సిన్న బిడ్డలా సాకినా. ఐదారీతలు పైనే ఈని నేను సాకిన దానికి దాని రకతం పాలు సేసి మాకిచ్చి మాకు నాల్గురాళ్లు ఎనకేసేలా సేసినాది. మేమిట్టా ఉండామంటే దాని పుణ్యమే. అట్టాంటి దాన్ని అది ఇయ్యాల ముసిల్దైనాదని, పాలియ్యటం లేదని కబేళాకు తోల్తానంటడు నా మొగుడు. మడిసనే వాడట్టా సేత్తాడా? తాగుబోతు ముండాకొడుకు. పెద్ద గొడవైనాది నాకు ఆడికి. నేను తెలివిలేని దాన్నంటా! అది ముసిల్దైది పోయినాది దానితో ఏంది లాభం. మేత దండగంటా! రేపు ఆడు ముసలోడు కాకుండ ఉంటాడా? ఆడు ఏమి సంపాదీయడం లేదని ఆడికి తిండి దండగని రోగం రొస్టు వత్తే పైసలు ఖర్సెట్టాలని ఆడ్ని అట్టే పిల్లగాళ్లు వదిలిత్తే ఏమవౌతదంటా? మడిసన్నాక కొద్దిగా గ్నానముండలా..."

గట్టిగా మాటల వినపడతుండటంతో బైటికి వచ్చారు అమ్మాయమ్మ కొడుకులు పాలవిడ మాటలు అచ్చం తమనే అంటునట్టుగా తోచడంతో వాళ్లకు కోపం ముంచుకొచ్చింది.

"పెద్ద తెలిసినదాన్ల మాట్లాడుతున్నావ్ ముసలి గొడ్డును ఇంట్లో పెట్టుకొని పూజిస్తావా ఏంటి. అది ఎప్పుడైనా చావాల్సిందే కదా. అది ఉండి ఉపయోగమేమైనా ఉందా." అన్నాడు అమ్మాయమ్మ చిన్న కొడుకు కోపంగా.

అమ్మకు వచ్చిన జబ్బును ఎలా నయం చేసి ఆమెను కాపాడుకోవాలన్న ఆలోచన కన్నా రాబోయే కష్టనష్టాలను గురించి తీవ్రంగా చర్చించుకొంటుంటే విసుగేసినా కూతురు "ఎందుకురా! అమ్మ ఆరోగ్యం బాగోలేక చూపించకపోతే రేపో మాపో చచ్చేటట్లున్న ఆమెను పక్కన పెట్టుకొని లాభనష్టాలు కష్టనష్టాల గురించి ఆలోచించటానికి సిగ్గులేదు." అనింది ఉక్రోషంగా.

ఆమెకు ఆ మాటతో కోపం అవధులు దాటింది. సదువుకొన్నోళ్లు మీరట్టా మాటాడుతారేంది? గొడ్డైతే మాత్రం దాని ప్రాణం కాదా ఇన్ని దినాల దాని మీదే బతికి ఇయ్యాలా అట్టా సేస్తే? ఎట్టా? రేపు వాడమ్మ ముసలైందని రోగం వచ్చి మంచాన పడ్తే దానికి తిండి దండగని ఆసుపత్రికి పైసలు ఖర్సవతాయని ఆ ముసల్దాన్ని ఏ కబేళాకు తోల్తాడు?. పనికి రాని ఇరిగిపోయిన వస్తువుల లెక్కన పాణేం మున్నదాన్ని పనికి రాదని ఖర్సైతాదని ఒకే గాట కట్టేత్తే మడిసికి పశువు తేడా యాడుంటాది."

అని కొద్దిసేపాగి. "పాపమది ఆఖర్న కబేళకెళ్తూ సస్తూకూడ మాకు పైసలు ముట్ట చెప్పి పోయినాది. దాంతో వాడేం మిద్దెలు కట్టిస్తాడా రాజభోగాలేల్తాడా?" అంటూ కన్నీళ్లు పెట్టుకోసాగింది.

అమ్మాయమ్మ కొడుకులకు కోడళ్లకు నోట మాట రాలేదు. ఒకరి ముఖాలు ఒకరు చూచుకొంటూ ధైర్యంగా అమ్మాయమ్మ ముఖం వైపు చూడలేక పోయారు. అది క్షణకాలం మాత్రమే.తరువాత బంధాలు బాంధావ్యాల కన్నా ఉపయోగం లేని బరువు వాళ్లను బలహీనమైన పశువుల్ని చేసేస్తుంటే "సర్లే భలే చెప్పొచ్చావ్. వెదవ సొద. వెళ్లిక్కడ్నుంచి మోసేవాడికి తెలుస్తుంది కాడి బరువు. నీకేం తెలుసు అని చిన్నోడు కసురుకొని లోపలికెళ్తే పెద్దోడు అంతే కోపంగా దాన్ని చూస్తు వాడ్ని అనుసరించాడు. వచ్చిన పని చూసుకొని పోకుండా వెధవ సొల్లు కబుర్లెందుకే వెళ్లు వెళ్లు అని విసుక్కొన్నాడు వాడి మేనమామ. తన మొగుడ్నంటే వాళ్లకు ఎందుకు అంత కోపం వస్తుందో అర్థం కాక గొణుక్కొంటు వెళ్లి పోయింది పాలావిడ.

అమ్మాయమ్మ చూపుల్లో ఎలాంటి భావం కనపడలేదు. కబేళాకు వెళ్లేందుకు సిద్ధమౌతున్న నిర్భాగ్య జీవిలా నిర్లిప్తంగా ఉంది. కబేళాకు తనమ్ముడు బోతు యజమానికి అంతో ఇంతో సొమ్ము వచ్చేటట్లు చేసిన గేదెలాగా తన కొడుకులకిచ్చేందుకన్నట్లు ఆమె చేతిలోని బంగారు గాజులు సిద్ధంగా ఉన్నాయ్.

✦

కథలకు ఆహ్వానం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహ కథలకు ఆహ్వానం పలకుతోంది. మంచి కథలను ఎంపిక చేసి ప్రచురిస్తాం. కథ సమకాలీన పరిణామాలు, పరిస్థితుల నేపథ్యంగా వుండాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో వివిధ రంగాల్లో చోటు చేసుకున్న, చేసుకుంటున్న విపరిణామాలను కథాంశంగా తీసుకోవచ్చు. ప్రగతిశీల చైతన్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే కథలకు ప్రాధాన్యత. మూఢనమ్మకాలు పెంచేవిగా, ఏ సామాజిక తరగతిని ప్రత్యేకంగా నొప్పించేదిగా వుండకూడదు. మాండలికాలు ఉపయోగించినా కథన శైలి అందరికీ బోధ పడేలా వుండాలి. నవ్యత, వైవిధ్యం కలిగిన కథలకు ప్రత్యేక ఆహ్వానం.

నిబంధనలు

కథ నిడివి ప్రింటులో మూడు ఎ4 కాగితాల్లో వుండాలి. చేతిరాతలో అయితే 8 నుంచి 10 కాగితాల్లో వుండాలి. ప్రింటయినా, చేతిరాతైనా కాగితానికి ఒకవైపు మాత్రమే వుండేలా... జిరాక్స్ ప్రతిని పంపాలి. కథలను తిప్పి పంపడం వుండదు. పేరు, పూర్తి చిరునామా, ఫోన్ నెంబరు తప్పక రాయాలి. మా చిరునామా: స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం. 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.

<u>మెయిల్ అడ్రస్:</u>

<u>snehaweekly.praja@gmail.com</u>

-ఎడిటర్

మరాఠి బకర్‌వాడి

కావాల్సినపదార్థాలు

మైదా- 1కప్పు
శనగపిండి- 3/4 కప్పు
కారం -1 టేబుల్ స్పూన్
కొత్తిమీర పొడి- 1టేబుల్ స్పూన్
నూనె- 1 టేబుల్ స్పూన్
ఉప్పు- తగినంత
నీరు- సరిపడ

స్టఫింగ్ కోసం

కొబ్బరి తురుము - 1కప్పు
నువ్వులు - 1/4 కప్పు
అల్లం -1 టేబుల్ స్పూన్
కొత్తిమీర పొడి- 1 టేబుల్ స్పూన్
మిర్చితరుగు- 1టేబుల్ స్పూన్
పసుపు-1టీస్పూన్
జీలకర్ర-1టీ స్పూన్
ఇంగువ-1/4 టీ స్పూన్
పంచదార-1 టేబుల్ స్పూన్
ఉప్పు- తగినంత

తయారుచేసే విధానం

ముందుగా ఒక బౌల్ తీసుకుని మైదా, శనగపిండి, కారం, కొత్తిమీర పొడి, ఉప్పు వేసి బాగా కలపాలి. తర్వాత కొద్దిగా నీరును వేసి బాగాకలిపి ముద్దలా చేసి కొద్దిగా నూనె రాసి పక్కనపెట్టుకోవాలి. స్టౌపై పాన్ పెట్టి వేడెక్కిన తర్వాత కొబ్బరి తురుము, నువ్వులు, అల్లం పేస్ట్ వేసి వేయించుకోవాలి. తర్వాత కొత్తిమీర పొడి, మిర్చి పేస్ట్, పసుపు, జీలకర్ర, పంచదార, ఇంగువ, ఉప్పు ఒక్కొక్కటిగా వేస్తూ మరి కొంత సేపు వేయించుకోవాలి. ఒక బౌల్‌లోకి ఈ మిశ్రమాన్ని తీసి కలపాలి. ఇప్పుడు ముందుగా కలిపి పెట్టుకున్న శగనపిండి మిశ్రమాన్ని ఉండలుగా చేసి చపాతీలా వత్తాలి. వాటిపై కొద్దిగా నీరు చల్లి బౌల్‌లో ఉంచిన కొబ్బరి తరుము మిశ్రమాన్ని పరిచి రోల్‌చేసి చివర్లు మడిచి గట్టిగా ప్రెస్‌చేయాలి. ఇప్పుడు ఒక్కొక్క రోల్‌ని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేయాలి. బాణలిలో నూనె వేసి వేడెక్కిన తర్వాత కట్‌చేసి పెట్టుకున్న ముక్కల్ని వేసి వేయించుకోవాలి. టీ టైమ్‌లో వేడి వేడిగా తింటే ఇవి రుచికరంగా ఉంటాయి.

కొతింభీర్ వడి

కావాల్సిన పదార్థాలు

శనగపిండి/ బఠాణీ పిండి- 1కప్పు
బియ్యప్పిండి- 2 టేబుల్ స్పూన్లు
నీరు- సరిపడా
కొత్తిమీర తరుగు- 1/2 కప్పు
వేయించిన నువ్వులు- 1టేబుల్ స్పూన్
నిమ్మరసం-1 టేబుల్ స్పూన్
అల్లం తరుగు - 1 టేబుల్ స్పూన్
పచ్చిమిర్చి-1టేబుల్ స్పూన్
బేకింగ్ సోడా -1/4 టీ స్పూన్
కారం 1/2 టేబుల్ స్పూన్
పసుపు-1/2 టేబుల్ స్పూన్
గరమ్‌మసాల-1/2 టీ స్పూన్
ఉప్పు- తగినంత
నూనె-సరిపడా

తయారుచేసే విధానం

ఒక బౌల్‌లో బఠాణి పిండి, బియ్యప్పిండి వేసి గోరువెచ్చని నీటితో ఉండలు లేకుండా కలుపుకోవాలి. ఇందులో వేయించిన నువ్వులు, నిమ్మరసం, కొత్తిమీర తరుగు, అల్లం, పచ్చిమిర్చి, కారం, పసుపు, గరం మసాల, ఉప్పు వేసి బాగా కలపాలి. ప్రెషర్ కుకర్‌లో రెండు కప్పులు నీరు పోసి కుక్కర్ ప్లేట్‌ను ఉంచి దానిపై బఠాణి మిశ్రమం ఉన్న బౌల్‌ని ఉంచి విజిల్ లేకుండా కుక్కర్ మూత పెట్టి పదిహేడు నిమిషాల పాటు ఉడికించాలి. ఈ మిశ్రమం పూర్తిగా ఉడికిన తర్వాత చిన్న చిన్న ముద్దలుగా చేసి చేత్తో ప్రెస్ చేసి ఒక ప్లేట్‌లో పెట్టుకోవాలి. ఒక పాన్ పై కొద్దిగా నూనె వేసి ఒక్కో ముక్కనీ బంగారు రంగు వచ్చేవరకూ వేయిస్తే కొతింభీర్ వడి రెడీ!

సుబుధాన్ వడా

కావాల్సిన పదార్థాలు

సగ్గుబియ్యం- 1కప్పు
బంగాళాదుంపలు-5
పల్లీలు- 1/2 కప్పు
పచ్చిమిర్చి-2
నిమ్మరసం-4 టేబుల్ స్పూన్లు
మిరియాల పొడి- 1టేబుల్‌స్పూన్
జీలకర్ర పొడి -1 టేబుల్ స్పూన్
ఉప్పు-తగినంత
కొత్తిమీర తరుగు-1/2 కప్పు

తయారు చేసే విధానం

ముందుగా ఒక బౌల్‌లో సగ్గుబియ్యం గింజల్ని వేసి 5-6 గంటల పాటు నానపెట్టుకోవాలి. తర్వాత బంగాళ దుంపల్ని ఉడికించి పెచ్చుతీసి పేస్టులా చేయాలి. స్టౌ పై ప్యాన్ పెట్టి పల్లీలని వేయించి మిక్సీ జార్‌లో వేసి పొడిచేసుకోవాలి. అందులో కొత్తిమీర తరుగు, రెండు స్పూన్లు నిమ్మరసం, పచ్చిమిర్చి తరుగు కూడా వేసి మెత్తగా బ్లెండ్ చేయాలి. ఇప్పుడు ఒక బౌల్‌లో పల్లీ పౌడర్ మిశ్రమం, నానపెట్టిన సగ్గుబియ్యం, బంగాళ దుంపల పేస్ట్‌లని తీసుకుని మెత్తగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని ఒవెల్ ఆకారంలో చిన్న చిన్న

ఉండలుగా చేసి ఒక ప్లేట్‌లో పెట్టుకోవాలి. స్టౌపై బాణలి పెట్టి నూనె వేసి వేడెక్కిన తర్వాత ఒక్కో ఉండని నూనెలో వేసి బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. కొబ్బరి పచ్చడి లేదా కొత్తిమీర పచ్చిడితో ఈ వడల్ని వేడి వేడిగా తింటే రుచిగా ఉంటాయి.



అతికిద్దాం

చింటూకి ఈ మధ్య అల్లరి మరీ ఎక్కువైపోయింది. డైనోసార్ బొమ్మను కత్తిరించి అతికించకుండా వెళ్లిపోయాడు. ఇక్కడిచ్చిన బొమ్మ ఆధారంగా మీరు దాన్ని జాగ్రత్తగా అతికించేయండి.



రంగులు అద్దండి



భిన్నమైనదేది

ఇక్కడున్న బాక్సుల్లో ఒక్కో వరుసలో భిన్నంగా ఉన్న వాటిని గుర్తించి సున్నా చుట్టేయండి.



ఆకులతో బొమ్మ

మనింటిముందు రాలిపడుతుండే పచ్చి ఆకులు, ఎండుటాకులతో తూనీగ బొమ్మ ఎలా చేయొచ్చో ఇక్కడ ఇచ్చాం! దాన్ని గమనించి మీరూ తయారుచేసేయండే!



కనిపెట్టండి

ఒక అడవిలో మీకు కనిపిస్తున్న జంతువులు, పక్షులతోపాటు మనం ఉపయోగించే కొన్ని వస్తువులు కూడా దాగున్నాయి. పక్కనున్న బొమ్మల ఆధారంగా అవెక్కడున్నాయో కనిపెట్టి సున్నా చుట్టండి.



నేర్చుకుందాం

పిల్లలూ! మీకు బొమ్మలు గీయడమంటే ఎంతో ఇష్టం కదూ! మీ కోసం విమానం బొమ్మ ఎలా గీయచ్చో ఇక్కడిచ్చాం. మీరూ ప్రయత్నించండి.



షూబిల్



పిల్లలూ! మీరు ఎన్నో రకాల పక్షుల పేర్లు వినే ఉంటారు. అయితే షూ బిల్ పేరెప్పుడైనా విన్నారా.. అన్ని పక్షుల కంటే పెద్ద పరిమాణంలో ఉండే ఈ షూబిల్ – తూర్పు ఆఫ్రికాలో సూడాన్, కాంగో, ఉగాండా జాంబియాలోని చిత్తడి అడవుల్లో ఎక్కువగా ఉంటాయి.

- 24 సెం.మీ. పొడవు, 20 సెం.మీ వెడల్పున షూ ఆకారంతో ఉండే వీటి ముక్కు భాగంతోనే వీటికి ఆ పేరు వచ్చింది.
- నీటిలో ఉండే రకరకాల చేపలతో పాటు నత్తలు, వానపాములు, తాబేలు, మొసలి పిల్లల్ని ఇవి లాగించేస్తుంటాయి.
- ముక్కు చివర్ల కొనతేలిన భాగం వీటికి వేగంగా చేపల్ని పట్టుకునేందుకు ఎంతో ఉపయోగపడుతుంది.
- పెద్ద పెద్ద రెక్కలున్నా షూబిల్స్‌కి అవి వేటకి మాత్రమే ఎక్కువగా ఉపయోగపడతాయి. రెక్కలతో అవి ఎక్కువ దూరం ఎగరలేవు.
- 100–140 సెం.మీ. ఎత్తుండే ఈ పక్షులు దాదాపు అన్ని పక్షుల కంటే ఎత్తైనవనే చెప్పొచ్చు.
- 4–7కిలోల బరువుండే కొన్ని షూబిల్స్ మనుషుల కంటే ఎత్తుంటాయి అంటే ఆశ్చర్యం కలుగుతుంది. 5–7 అడుగుల షూబిల్స్ ఇప్పటికీ ఆఫ్రికా ప్రాంతంలో కనిపిస్తాయి.
- అతి నిదానంగా తిరుగుతూ కనిపించే షూబిల్స్ ఎగిరేటపుడు అత్యంత వేగంగా నిమిషానికి 150 సార్లు వాటి రెక్కల్ని ఆడిస్తుంటాయి.
- బూడిద రంగులో ఉండే ఈ పక్షి కళ్లు మాత్రం లేత నీలిరంగుతో అందంగా ఉంటాయి. ఇవి ఏడాదికి ఒక్క సారి మాత్రమే పొదుగుతుంటాయి.
- షూబిల్స్ కూడా కొంగలాగే ఎక్కువ సేపు స్టాట్యూలా నిలబడిపోగలవు.

పదాలు పూరించండి

ఇక్కడ ఏడు బొమ్మలున్నాయి. అయితే వాటి ఇంగ్లిష్ పేర్లలో ఒక్క అక్షరం మిస్సయ్యింది. ఆ అక్షరాన్ని రాస్తే పదం పూర్తవుతుంది. బొమ్మల ఆధారంగా మిస్సయిన అక్షరాన్ని గుర్తించి అక్కడ రాసేయండి.

_ing


_nap

_win

_ell

_pin


_ock

ans: ring, snap, twin, bell, spin, rock

పదవికాసం - 25

కూర్పు: రావెళ్ల

1		2	3	✿	4	5		6
	✿	7		✿	8		✿	
9	10	✿	11	12		✿	13	
14		15	✿		✿	16		
✿	✿	17		✿	18		✿	✿
19	20		✿	21	✿	22	23	24
25		✿	26		27	✿	28	
	✿	29		✿	30	31	✿	
32				✿	33			

ఆధారాలు

అడ్డం

1. అడవి (4)
4. కోడలు చివరనున్న ఒక సీరియల్ (4)
7. ఇంటిలోపల ఉండే వాటిలో ఒకటి (2)
8. తిరగబడ్డ బ్రదర్ (2)
9. యముడి లోకంలో చివరలేదు (2)
11. అపరాల పంటల్లో ఒకటి (3)
13. ఈ పంక్తి భోజనాలంటే ఎవరికైనా ఇష్టమే (2)
14. ఈ చెట్టుకాయల్ని సాంబారులో వేస్తారు (3)
16. మొత్తము అనే అర్థం వచ్చేపదం (3)
17. నక్క అరుపు అటునుండి (2)
18. వింటిని కట్టేతాడు (2)
19. ఆరున్నొక్క....(3)
22. మొదలు లేని పట్టణము (3)
25. ఈ బస్సు ఫలానా ఊరి మీదుగా వెళుతుంది (2)
26. ఉత్సవము (3)
28. 'మ్రాను' రూపాంతరము (2)
29. మధ్యలేని కావున (2)
30. చేపల వేటకు ఇది అవసరం (2)
32. ప్రథమా విభక్తి ప్రత్యయము (4)
33. పేకాటలో ఇదో రకం ఆట (4)

నిలువు

1. విధేయత తోడిది (4)
2. మెడలో ధరించేది (2)
3. ముదిమి యథావిధిగా (3)
4. రంధ్రము (3)
5. కింది నుండి కెరటం (2)
6. వట్టి చెయ్యి (4)
10. తన తోడి జంటపదం (2)
12. బొగ్గులు కాలి మిగిలేది (2)
13. సమంలో సున్నా లోపించింది (2)
15. గొంతు (3)
16. సప్తస్వరాలలో మొదటి మూడు (3)
19. రామాయణంలో విలన్ (4)
20. హిందీలో వెళ్ళును (2)
21. చురక లాంటిదే (2)
23. రమాదేవిలో దేవి పారిపోయింది (2)
24. తేలుటకు వ్యతిరేకం (4)
26. బెత్తలు కాదు (3)
27. ధ్వని (3)
29. కాకి అరుపు (2)
31. పాండవుల... ఇల్లు (2)

సుడోకు

		3		5		8	9	7
8				1	2	3		
	9			3		4	2	1
9	3	6			1	7		
		1				5		
		7	2			1	8	6
3	4	2		6			7	
		9	8	2				3
5	6	8		7		2		

గతవారం జవాబులు

7	3	4	2	6	8	1	5	9
1	2	8	3	5	9	4	6	7
6	5	9	4	1	7	8	2	3
8	9	7	5	3	6	2	4	1
2	4	5	8	9	1	3	7	6
3	1	6	7	4	2	9	8	5
4	6	3	9	8	5	7	1	2
9	7	1	6	2	4	5	3	8
5	8	2	1	7	3	6	9	4

1 భాం	2 డా	3 గా	రం	✿	4 రో	జు	✿	5 లా	6 భం
7 గ్రా	ము	లు	✿	8 సా	లు	✿	9 సో	య	గం
✿	లు	✿	10 త	ల	✿	11 త	మ	రు	✿
12 ట	✿	13 గ	మ	✿	14 శ్రీ	హ	రి	✿	15 వ
16 బు	వ్వ	✿	17 ల	త	ము	కీ	✿	18 త	ధ్యం
✿	19 అ	20 మ	పా	✿	ఖం	✿	21 అ	ష్ణు	✿
22 టై	✿	23 సో	కు	లు	✿	24 గ	ఢ్డం	✿	25 న్యూ
✿	26 కం	✿	లు	✿	27 రా	జా	✿	28 క	✿
29 రం	✿	30 లు	✿	31 ఏ	✿	32 యి	33 త	ర	34 చ
35 గం	గ	డో	లు	✿	36 స్టో	✿	37 మా	చ	ట్లం

ఏంజెలా మెర్కెల్

దిల్మా రౌసెఫ్

జులియా గిలార్డ్

హిల్లరీ క్లింటన్

మాయావతి

థెరిసా మే

షార్ట్ కట్

బ్రిటన్ ప్రధానిగా థెరెసా మే వచ్చీరాగానే కొందర్ని ఓ విషయం బాగా ఆకట్టుకుంది. అదే ఆమె షార్ట్ కట్ జుత్తు. అప్పుడెప్పుడో మార్గరెట్ థాచర్‌ను అలానే చూశారు మరి. జర్మనీ చాన్సెలర్‌గా ఏంజెలా మెర్కెల్ కూడా అలానే బాగా కనిపించారు. అమెరికా అధ్యక్ష రేసులో ఉన్న హిల్లరీ క్లింటన్‌దీ షార్ట్ కటే. ఆస్ట్రేలియా ప్రధానిగా చేసిన జులియా గిలార్డ్‌ది అదే ఫ్యాషన్ స్టేట్‌మెంట్. వీళ్లందరి వరకు ఎందుకు మన ఇందిరది అదే పవర్ స్టేట్‌మెంట్ అయ్యింది. ఆమె మనవరాలు ప్రియాంక దాన్నే ఫాలో అవుతోంది. మాయావతిది అదే సింబాలిజమ్. ఇజ్రాయిల్ మాజీ ప్రధాని గోల్డా మెయెర్, కెనడా మాజీ ప్రధాని కింప్ క్యాంప్‌బెల్, ఫిన్‌లాండ్ మాజీ అధ్యక్షురాలు టార్జా హోలోనెన్, చిలీ మాజీ అధ్యక్షురాలు మిషెల్ బ్యాచెలెట్, ఐర్లాండ్ మాజీ అధ్యక్షురాలు మేరీ రాబిన్‌సన్, ఐస్‌ల్యాండ్ మాజీ ప్రధాని యోహాన్నా సిగుర్డార్డోటిర్, బ్రెజిల్ మాజీ అధ్యక్షురాలు దిల్మా రౌసెఫ్ ఇలా ఎంతోమంది దేశాధినేతలుగా చేసిన వారందరిదీ షార్ట్ కట్ స్టైలే. దీన్నంతా చూస్తుంటే పవర్‌కు, షార్ట్ కట్ జుట్టుకు ఏదో సంబంధం ఉందేమోనన్న ఆలోచన కలుగుతుంది.

ఇందిరా గాంధీ

మార్గరెట్ థాచర్

KANDULA
GROUP OF INSTITUTIONS, KADAPA

36 YEARS OF EXCELLENCE



KSRM COLLEGE OF ENGINEERING	KORM COLLEGE OF ENGINEERING	KLM COLLEGE OF ENGINEERING FOR WOMEN	KSRM COLLEGE OF MANAGEMENT STUDIES
KSRM	**KORK**	**KLMW**	**KSRM**

SALIENT FEATURES

- Accredited by NBA of AICTE and NAAC of UGC.
- Accredited "A" Grade by AP GOVT, One among the top 20 colleges in South India.
- Innovation center by LIT Academy, Chennai.
- MOU's with APSSDC, JKC, Oracle IT Academy.
- Highly Experienced and well qualified Professors.
- KSRM is the only institute in rayalaseema to recive DST-FIST grants in 2014.
- 100% Placement Assistance for all Eligible students.
- Digital library, A/C seminar hall, computer labs & E-class rooms.
- DST funded State-of-the-art laboratories, Computer Centers, workshops & Laboratories.
- Sprawling play ground spread over 8 acres provided with Basket court, Turf Cricket pitch.
- special attenction on employable skills, personality development, health and physical education.
- Carrier guidence and counseling center, Special coaching for GATE / GRE / TOEFL / IELTS.
- Campus recruitment training program, NPTEL E-learning classes
- Separate Hostel facilities for Boys & Girls with exclusive hostel for 1st Year B.Tech students
- Rich Alumni with 12000 students working across the globe in various corporate and GOVT Sector
- Round the clock internet facility with 50Mbps wi-fi enabled

PROGRAMMES OFFERED

Bachelor of Technology
- Civil Engineering
- Electrical and Electronics Engineering
- Mechanical Engineering
- Electronics and Communications Engineering
- Computer Science and Engineering

Master of Technology
- Geotechnical Engineering (Civil)
- Power Systems, PE & ED (EEE)
- CAD/CAM (ME)
- DECS, VLSI (ECE)
- Computer Science and Engg(CSE)

Master of Busiess Applications

Sri. S. Sankar Reddy
Chairman


Sri. K. Sivananda Reddy Ex-MLA
Correspondent


Prof. K.S.N. Reddy
Director

HCL TALENTCARE · accenture · IBM · TATA · amazon · Tech Mahindra · Mindtree · Collabera · Adecco · soma

Precision Group · Yardstick · Cloud Machine · EOS · PMRT · Traitsys · Glenwood Systems · AQUA PURE PLUS PVT. LTD.

Datalogics · HDFC BANK · airtel · vodafone · S&P CAPITAL IQ · NANDI · Symantec · KEELINE

Contact for Admissions:

Dr. V.S.S. Murthy	Dr. V. Madhusudan	Dr. S. Khaja Peer	Dr. Krishna Mohan
98852 30680	94901 83556	99859 23357	98493 92584

Yerramasupalli (V),
C.K. Dinne (M), Kadapa-516003
Office : 08562 - 201488

Check List

Book Number	KNSR02B130	Date	03/09/22
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	No		
Missing Pages	No		
Prepared By	Mouni	Cutting By	Mouni
Scanned By	Shameeo9	Pages	29